చేరినవారనుకుంటాను. (బిగ్గరగా) అయ్యా! దయచెయ్యండి. నేను యీ వూరు మంచిదనుకుంటాను.

సదా—బహుమంచిగ్రామం.

గజా—ఇక్కడ సమస్త సదుపాయాలూ వున్నవి.

సుబ—ఈయేడు పంటలు బాగావున్నవా?

సదా—బాగానే వున్నవి.

సుబ—మీకేమయినా నల్లమందు వెయ్యడం అలవాటు వున్నదా?

సదా—లేదు. మిమ్మలిని మేము కొన్ని ప్రశ్నలను వెయ్యావలెనని వున్నది. అడుగవచ్చునా?

సుబ—అడగవచ్చునుగాని నేనేముందుగా కొన్ని ప్రశ్నలు వేస్తాను. వాటికి జవాబుచెప్పండి. మాతండ్రిగారి మేనమామకొడుకు మీతల్లిగారి మేనత్త మనమడైనట్టయితే, అతను పూజారి జాంబవంతుడికి యేమవుతాడు?

సదా—యేమీకాడు.

సుబ—యేమీకాకపోతే నన్ను మీరు యిలాగంటి సందర్భంమాలిన ప్రశ్నలు మాత్రం వెయ్యకండి.

సదా—(తనలో) నేననుకున్నట్టే యితనికి తప్పకుండా పైత్యచలనమే. (బిగ్గరగా) మీరేమీ సందేహపడవలసిన పనిలేదు. మేమటువంటి ప్రశ్నలు వెయ్యము. ఏమండీ! గజాననదాసుగారూ! మీరేమంటారు?

గజా—యెంతమాత్రమూ వెయ్యము. (తనలో) ఇది భూతలక్షణమే సందేహంలేదు.

సుబ—అలాగయితే ఆరంభించండి.

సదా—మీవూళ్ళో వింతవర్తమానాలు యేమయినావుంటే చెపుతారా?

సుబ—(తనలో) వీళ్ళువర్తమాన పత్రికలకు వ్రాసేవాళ్ళు కాబోలును. వీళ్ళకు తగినట్టుచెపుతాను. (బిగ్గరగా) మా వూళ్ళోవక లేగదూడ అయిదుకాళ్ళతో పుట్టింది. వకముసలావుకు మూడుకొమ్ములువున్నవి.

సదా—(తనలో) దీనితో యితనికి పైత్యలక్షణముయినట్టు స్థాపనఅయినది. అయినాకాపీ యింకొక్క ప్రశ్నకూడా అడిగిచూస్తాను (బిగ్గరగా) ఇవివింత సమాచారాలే. రామాయణంవిన్నారుగదా రాముడికి సీత యేమవుతుందో చెప్పగలరా?

సుబ—(తనలో) వీళ్ళునన్ను పిచ్చివాణ్ని చేసి ఆడించవలెనను కుంటూవున్నారు. వీళ్ళకు బుద్ధివచ్చేటట్టు జవాబు చెపుతాను. (బిగ్గరగా) మీకు యీాయన అయినట్టే రాముడికి సీత మేనమామమొగుడవుతుంది. తెలిసిందా?

సదా—(తనలో) ఇఖప్రశ్నలక్కరలేదు. ఇప్పుడు పిచ్చిస్థిరపడ్డది.

గజా—(తనలో) ఇతణ్ని యిప్పుడు దెయ్యం సంపూర్ణంగా ఆవహించి వున్నది. (బిగ్గరగా) అయ్యా! యోగిగారూ! మీసెలవైతే నేనుకూడా యీచిన్నవాణ్ని వకటి రెండుప్రశ్నలు అడుగుతాను. అబ్బాయీ! యిప్పుడు మీ యెదుట యెవరైనా నిలుచున్నట్టు కనపడుతూ వున్నారా?

సుబ—కనపడుతూవున్నారు. మీరుయిద్దరూ నిలుచున్నట్లు కనపడుతూ వున్నారు.

సదా—అబ్బాయీ! మిమ్మల్ని నేనువక్క ప్రశ్న అడుగుతాను గాని మరివకలాగు అనుకోక సరిఅయిన జవాబు చెప్పండి. మీ తండ్రి గారికి యెప్పుడయినా పైత్యభ్రమ వుండేదా?

సుబ—(తనలో) వీళ్ళుబుద్ధిమాలిన ప్రశ్నలువేస్తూవున్నారు. అయినాకానీ యింకాయేమి అడుగుతారో వక్కనిముషం వోపికచేసి వింటాను. (బిగ్గరగా) లేదు.

సదా—పోనీ. మీబంధువులలో యెవరికైనా వున్నదా?

సుబ—వున్నది. మామేనమామగారికి యోగవుపిచ్చవున్నది. (తనలో) ఇఖనేనీ పాడుప్రశ్నలకు జవాబు చెప్పలేను. నిద్రవచ్చినట్టు నటిస్తాను. (అని గోడకుఁ జేరగిలఁబడి కన్నులు మూసికొనుచున్నాఁడు)

సదా—(దగ్గిరకుపోయి మెల్లగా చేయిపట్టుకొని చూచి) చేతిలో పైత్యనాడి బాగా ఆడుతూవున్నది. గజాననదాసుగారూ! మీరుకూడా చూడండి.

గజా—(చేయిపట్టుకొనిచూచి) యిదిపైత్యనాడికాదు. తప్పకుండా భూతనాడి ఆడుతూవున్నది. ఇది గ్రహలక్షణం.

సుబ—(కన్నులువిప్పిలేచి) మీరునాకు నిద్రాభంగం కలుగచేస్తూవున్నారు. మీరు తక్షణం యీగది విడిచి వెళ్ళకపోయినట్టయితే మిమ్మలిని కొట్లోపెట్టి తాళం వేస్తాను. (అని ముందుకువచ్చుచున్నాడు)

ఇద్దఱు—(చేతులడ్డము పెట్టుకొని వెనుక వెనుకకు నడుచుచు) తాళండి వెళుతూవున్నాము. (అని గుమ్మముచేరి పరుగెత్తుచున్నారు.)

సుబ—వేగిరంవెళ్ళకపోతే యీపుస్తకాలకట్ట పుచ్చుకుని నెత్తి పగలవేస్తాను. (అని రెండుచేతులతోను రెండుతాటాకుల పుస్తకములు విసరివేయుచున్నాఁడు) దెబ్బతగలలేదు. వాళ్ళు తప్పించుకుని పారిపోయినారు. ఇఖనేను యీయింట్లోవుండకూడదు. యీవూళ్ళో యింత

మంది పిచ్చవాళ్ళు బహాటంగా తిరుగుతూ వుంటేపట్టుకోకుండా పోలీసు వాళ్ళు యేమిచేస్తూవున్నారు? నేనుయిప్పుడు మా ముసలి పిచ్చాయ నను తీసుకుని వెళ్ళి స్టేషనులో వప్పగించి ఆయనకూతురిని తీసుకునిలేచి పోతాను. సుమతి కూడా నేను కనపడినప్పుడల్లా యేదోవింతగా చూస్తుంది.

[సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—(కలయఁజూచి) యీపుస్తకాలన్నీ యిలాగు పారవేసి వున్నవేమి?

సుబ—సుమతీ! యీపుస్తకాలా?

సుమ—(తనలో) ఇతడే పారవేసినట్టున్నాడు. నన్నేమిచేసి పోతాడో అని నాకు భయంవేస్తూవున్నది. (అని పరుగెత్తఁబోవు చున్నది.)

[తేటిపాఅభూచుచు మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—అమ్మాయీ! భయపడకు. అబ్బాయీ కొంచెం శాంతించు. పుస్తకాలు పాడుచెయ్యకు. (అని యాతనివంక రెప్పవాల్చక చూచుచున్నాఁడు)

సుబ—మామా! అంతాచెపుతాను వినండి. నేను మహానెమ్మదైనవాణ్ని. నాకు సాధారణంగా కోపంరాదు. యీయింట్లో జరుగుతూ వున్న పిచ్చపనులవల్ల నావంటి శాంతుడికికూడా కోపంవస్తూ వున్నది. యిఖనైనా మీరు యీపిచ్చపనులు కట్టిపెట్టకపోతే మిమ్మలినికూడా మెడపట్టుకుని అవతలికి గెంటివేస్తాను.

మతి—(చిఱునవ్వుతో రెప్పవాల్చక చూచుచు) సుబలా! కొంచెం శాంతించు. (తనలో) యిప్పుడు లొంగుబాటులో లేదు. పోలీసుబంట్రోతువస్తే బాగావుండును.

సుబ—శాంతిస్తాను. (అని మీాదికి వచ్చుచున్నాఁడు.)

సుమ—బావా ముసలాయనజోలికి రాకు. (అని యిద్దఱికిని నడుమ వచుచ్చున్నది.)

మతి—అమ్మాయీ! అడ్డంరాకు. నాకు భయంలేదు. నన్ను యోగదృష్టితో చూడనియ్యి.

సుబ—ఓప్రియురాలా! నీవేమీాభయపడకు. నీతండ్రికి నేనేమీా అపాయంచెయ్యను. మామగారూ! నేను వక్కనిముషం మీాకోమార్తెతో మాట్లాడవలెను. దయచేసి మీారు వక్కపర్యాయం అవతలికి వెళ్ళండి. (అని సుమతిని ముందుకులాగుకొని, మతిమంతుని మెల్లగా గుమ్మమువద్దకు త్రోసికొనిపోయి యీవలకుఁ బంపి తలుపు వేయుచున్నాఁడు.)

సుమ—అయ్యో! మానాన్నగారు—

సుబ—సుమతీ! నీవికారపుచేష్టలుమాని వక్కనిముషం నాతో నెమ్మదిగా మాట్లాడు. యిలావచ్చికూర్చో. నాకేసి బెదరిచూడకు. నాహృదయేశ్వరీ! భయంమాని నేను యిప్పుడు తరిమివేసిన యిద్దరు ముసలివాళ్ళూ యెవరోచెప్పు.

సుమ—(కూరుచుండి) వారు పిచ్చవైద్యులు.

సుబ—వాళ్ళు పిచ్చవాళ్ళని నేను చూడడంతోటే అనుకున్నాను.

సుమ—వారికి పిచ్చలేదు. వారు పిచ్చకుదిర్చే వైద్యులు. నీపిచ్చయెటువంటిదో చూడడంనిమిత్తం వారు వచ్చినారు.

సుబ—యేడిపినారులే. సుమతీ! భయపడకు. తిన్నగా కూర్చో. నాకేసి మొగంయెత్తి చూడు. మన బాల్యస్నేహమంతా యీనాలుగు సంవత్సరాలలోనే మరిచిపోయినావా?

సుమ—(అతనివంక చూచుచు) బావా! నీకు నిజంగా పిచ్చ వున్నదో లేదో చెప్పు.

సుబ—నీకలాగంటి సంశయం యెందుకు కలిగింది?

సుమ—తల్లి పోయినప్పటినుంచీ మీ మేనల్లుడికి విచారంచేత పిచ్చ యెత్తిపోయిందని మానాన్నగారిపేర మీ బాబయ్యగారే వ్రాసినారే.

సుబ—దానికర్థంస్పష్టంగా తెలుస్తూనేవున్నది. విచారంచేత పిచ్చయెత్తిపోయిందంటే దుఃఖంచేత యేమీ తోచకుండా వున్నదని అర్థంనీకు బోధపడలేదా? నన్ను చూచినతరువాత యిప్పుడైనా నాకు పిచ్చలేదని నీకు నిశ్చయంకలిగిందా లేదా?

సుమ—నీవు యిప్పుడు మంచివాడవులాగే కనపడుతూవున్నావు.

సుబ—అలాగైతే నిన్ను వక్క ప్రశ్న అడుగుతాను. నిజం చెప్పు. నిన్ను మీనాన్నగారు యెవరికైనాయిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించినారా యింకా లేదా?

సుమ—(తలవంచుకొని) యింకా యెవరికీ యివ్వడానికి నిశ్చయం చెయ్యలేదు.

సుబ—అలాగయితే నన్ను వివాహం చేసుకోడానికి నీకు యిష్టంవున్నదా? మనం యిద్దరమూ మేనత్తమేనమామ బిడ్డలమూ బాల్యస్నేహితులమూ మాత్రమేకాకుండా యేకశరీరులముకూడా కావలెనని నాకు కోరికవున్నది. వేగిరంచెప్పు.

సుమ—నేను ఆలోచించుకొని చెప్పుతాను.

సుబ—ఆలోచనా లేదు యేమీ లేదు. వప్పుకో.

సుమ—నీవు యీసంగతి మానాన్నగారిని అడగవలెను.

సుబ—ఆయన వప్పుకోడు. ఆయన యిప్పుడు నన్ను చేసిన అవమానానికి నేను తగినపని చేస్తాను.

సుమ—నీవు అలాగంటిపని యెంతమాత్రమూ—

సుబ—తొందరపడబోకు. నిజంగా నేను యేమీచెయ్యను. పరియాచకానికి వక్క తమాషాచేస్తాను. ఇందులో నాకు నీవుకూడా సహాయంచెయ్యవలెను.

సుమ—అదేమిటో అంతా నాతోచెప్పు.

సుబ—ముందుగా చెప్పడానికివల్లకాదు. కాని కొంచెంసేపటికి నీకదంతా తెలుస్తుంది. ఆయననన్ను పిచ్చవాణ్నిగా కట్టివేసినాడు. అయన విషయంలో ఆపని నేనుచేస్తే ఆయనకు యెలాగువుంటుందో చూతాము.

సుమ—ఆయనకు యేమీశరీరబాధమాత్రం చెయ్యకు. ఆయన పిలుస్తూవున్నారు. నేను తలుపుతీసి లోపలికి వెళ్ళిపోతాను. (ఆ ప్రకారముగా చేయుచున్నది.)

[మంగలికత్తి చేతఁబట్టుకొని మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(తనలో) నేను యిప్పుడు యితసికి తలగొరగవలెను. లేకపోతే పిచ్చ నిమ్మళించదు.

సుబ—(తనలో) ఇతడు మంగలికత్తి తెచ్చినాడు. గొంతుక కోస్తాడాయేమిటి? (బిగ్గరగా) మామా! ఆగండి. ఆచేతిలోనిది దూరంగా పెట్టండి.

మతి—(తనలో) ఇతనికప్పుడే అనుమానం కలిగింది. యేమరిపాటుగా వున్నప్పుడు ఆపనిచెయ్యవలెను. (బిగ్గరగా) అబ్బాయీ! నా దగ్గిరగా వచ్చికూర్చో.

[గౌరి ప్రవేశించుచున్నది]

గౌరి—(మతిమంతునితో) అయ్యా! తమకోసం యెవరో తమాషావేషం వేసుకుని వకమనిషివచ్చినాడు. (అని తనలో నవ్వుకొనుచు సుబలునికి చేసైగచేయుచున్నది.) అతను ఠాణానుంచి వచ్చినానని చెప్పినాడు.

మతి—అతణ్ణి లోపలికి తీసుకునిరా. తక్షణం తీసుకునిరా. (తనలో) సందేహంలేదు. అతనుపోలీసు బంట్రోతు. అతను మంచి సమయంలో వచ్చినాడు. అతను యితనితల గట్టిగాపట్టుకుంటే యీకత్తితో నేను క్షవరంచేస్తాను. (అని కత్తిపయికి తీయుచున్నాఁడు.)

గౌరి—యిప్పుడే తీసుకునివస్తాను. (అని వెళ్ళుచున్నది.)

సుబ—(మతిమంతుని మొగమువంక చూచుచు) ఈముసలాయనకు నిజంగానే పిచ్చఅనుకుంటాను.

[మొగము కనఁబడకుండ ఎఱ్ఱతలగుడ్డ వికారముగా చుట్టుకొని రాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—ఇఖ నేను సిద్ధంగావుండవలెను. (అని కత్తి క్రిందపెట్టి బట్ట సవరించుకొనుచున్నాఁడు.)

సుబ—ఇడుగో రాముడు వచ్చినాడు. నాఅదృష్టం బాగావున్నది. (అని రామునకు చేసైగచేయఁగా రాముఁడు మరల సైగ చేయుచున్నాఁడు.) మామా! ఈమనిషివేషం బహువిచిత్రంగా వున్నది. యితడు యిక్కడికి యెందుకువచ్చినాడు?

మతి—యెందుకూలేదు. వూరికేవచ్చినాడు. యితడుగారిడీ చేస్తాడు. (అని రామునిదగ్గరకుపోయి సుబలునిచూపి సైగచేసి మెల్లగా)

నేను పట్టుకోవడానికి కబురు పంపించిన చిన్నవాడుయితడే. నీవుభయ పడకుండా గట్టిగాపట్టుకోవలెను.

రాము—మీరుముందు నడవండి. ముసలివారుమీారే భయపడక పోతే నేను భయపడుతునా?

మతి—(రామునితో) నేను యోగదృష్టితో చూచి అతణ్ని కదలమెదలకుండా చేస్తాను. అతడు నిశ్చేష్టితుడై చిత్రపుప్రతిమలాగు వున్నప్పుడు నీవువెళ్ళి పట్టుకోవలెను.

రాము—మీా యోగదృష్టి గీగదృష్టి యేమీా నాకు సహా యం అక్కరలేదు. నేను సిద్ధంగా వున్నాను.

మతి—నేనా కుర్చీ తెచ్చి యితనికి యెదురుగా వేసుకుని కూర్చుంటాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

సుబ—(రామునితో) అతడు కుర్చీలో కూర్చోవడంతోటే నీవు వెనుకనుంచి తాళ్ళువేసి వెంటనే కట్టవలెను.

రాము—మంచిది. అలాగేచేస్తాను. ఇయిగో త్రాళ్ళు నాచేతులో సిద్ధంగానే వున్నవి. (అని చూపుచున్నాఁడు.)

మతి—(కుర్చీ తెచ్చి సుబలునకెదురుగా వేసికొని కూరుచుండి రెప్పవాల్చక సుబలునిచూచుచు) అబ్బాయీా! జాగ్రతగాకూర్చో. (అని వెనుకతిరిగి రామునికి సైగలుచేయఁగా సుబలుఁడుకూడ సైగలు చేయుచున్నాఁడు.) అబ్బాయీా! నీవు యిందాకా చాలా దురుసుగా వున్నావు. ఇప్పుడు నెమ్మదిపడ్డావనుకుంటాను. (అని రెప్పవాల్చక మరల సుబలుని చూచుచున్నాఁడు.)

సుబ—అవును. (అని కన్నులరమోడ్చి కుర్చీకి జేరగిలఁబడి కూర్చుండి నిద్రపోయినట్టు నటించుచున్నాఁడు.)

మతి—(పెనఁగులాడుచు) ఓరి బుద్ధిహీనుడా! ఇందులో నీవు పొరపాటుపడి వకరినికట్టడానికి వకరినికట్టినావు.

రాము—వూరికే పెనుగులాడకండి. నేనుయెప్పుడూ పొరపాటు పని చేసేవాణ్ని కాను. (అని మరింతగట్టిగా బిగించి కట్టుచున్నాఁడు.)

మతి—(కోపముతో) ఇదేమిపని? నేను చెప్పినాకానీ నీకుబుద్ధి రాకుండావున్నదేమి? పిచ్చివాణ్ని నేనుకాను. నాకుయెదురుగా కుర్చీ మీద కూర్చున్న అతఁడు పిచ్చివాఁడు.

రాము—(అద్భుతపడ్డట్టు తలయూచుచు) పిచ్చవాళ్ళు యెప్పుడూ యిలాగే అంటూవుంటారు.

సుబ—నాకు బహువిచారంగా వున్నది.

రాము—నాకూ విచారంగానేవున్నది. అయినాకానీ పిచ్చ వాళ్ళ విషయంలో చెయ్యవలసినపని చెయ్యకతప్పదు.

మతి—(ఆగ్రహముతో) ఓరిపశువా! నేను పిచ్చవాఁడనట్రా? (అని పండ్లుపటపట కొఱుకుచున్నాఁడు.)

రాము—ఇతనిది సాధారణమయిన పిచ్చకాదు. నేను యింత మంది పిచ్చవాళ్ళను చూచినానుగాని ముసలితనంలో యిలాపళ్ళుకొరికే పిచ్చి నేను యిదివరకు యెక్కడా చూడలేదు. మీరేమంటారు?

సుబ—అవును. ఇది బహుప్రబలమయిన పిచ్చ.

మతి—సుబలా! నీవు పిచ్చలోవుండి యీదౌర్జన్యంలో నీవు నాకు యేమీసాయం చెయ్యలేని స్థితిలోవున్నందుకు నాకు బహువ్యస నంగావున్నది.

సుబ—నాకూ వ్యసనంగావున్నది.

రాము—ఈపిచ్చాయనతో మాటకుమాట జవాబుచెప్పకండి.

మతి—ఓరామా! ఓసుమతీ! ఓగారీ! వేగిరంవచ్చి నన్ను వద లించండి. అని పెనఁగులాడుచు కేకలు వేయుచున్నాఁడు.)

[సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—అయ్యో—

మతి—(వికారముగా కాళ్ళను చేతులను గింజుకొనుచు) అమ్మాయీ! సుమతీ! రా. వేగిరంరా. నాకట్లువిడిపించు. పిచ్చివాణ్ని నేనుకానని యీపశువుతో చెప్పు.

సుమ—(ఏడ్చుచు) అయ్యో! గొప్పవిపత్తువచ్చింది. యీమధ్య మీచేష్టలుచూచి యెప్పుడో యింతగతి పడుతుందని నేను యిదివరకే భయపడుతూవున్నాను.

రాము—అమ్మా! యెందుకు విచారిస్తావు? పిచ్చవాణ్నికట్టి వేస్తే క్షేమమేకాని యెవరికీ విపత్తులేదు.

మతి—(కన్నులెఱ్ఱచేసి పండ్లుపటపట కొఱుకుచు) పరమనిర్భాగ్యురాలా? బుద్ధిలేకుండా నీవుకూడా నీతండ్రికి పిచ్చఅంటూ వున్నావా? చూడునిన్ను—(అని ముందుకు జరగుచున్నాడు.)

సుమ—(పరుగెత్తి) సుబలా! నన్ను రక్షించు. ఓరీ! అబ్బీ! నీవు అయినను గట్టిగా పట్టుకుని నామీదికి రాకుండా చెయ్యలేవా?

రాము—చేస్తాను. మనయింట్లో చేంతాడు యెక్కడవున్నది?

మతి—(కోపముతో) ఓరిశుద్ధమున్నపోతా! నీకండకావరం—

రాము—ఈయనను చూడండి. ఈయనపని యిలాకుదరదు. అయ్యా! సుబలా! ఈయనకు క్షవరం చేసి నిమ్మకాయల పులుసు పట్టించి నీళ్ళుపోస్తేనేకాని ఈ వుద్రేకం తగ్గదు.

సుబ—అలాచేతాము. దీనితో పిచ్చబొత్తిగా పోకపోయినా కొంచెం ఉపశాంతి కలుగుతుంది. (అని క్రిందనున్న మంగలికత్తి తీయబోవుచున్నాడు.)

మతి—(మరింత గట్టిగా గింజుకొనుచు) సందేహంలేదు. వీళ్ళు యిప్పుడునన్ను చంపివేస్తారు. వక్కసారి నేను వీళ్లను యోగదృష్టితో చూచి స్తంభింపజేస్తినా—

[సుబలుఁడును రాముఁడును మతిమంతుని తలగోఁకుటకు సిద్ధపడుచుండఁగా సదానందయోగియు గజాననదాసును ప్రవేశించుచున్నారు.]

సదా—(గజాననదాసుతో) ఇది మరీవింతగావున్నది.

సుబ—(వెనుకతిరిగి వారినిచూచి) ఇదుగో యీయన పిచ్చి స్నేహితులుకూడా వచ్చినారు. రామా! వక్కనిముషం ఆగు.

రాము—ఈలోగా నీళ్ళతో తలతడుపుతూవుంటాను.

సుబ—వద్దువద్దు. (అని మతిమంతుని వెనుకవైపునవున్న సదానందయోగి గజాననదాసులవద్దకు వెళ్ళుచున్నాఁడు.)

రాము—మంచిది. (అని వెనుకతిరిగి చూడకుండ మతిమంతుని కుర్చీలో నదిమి పట్టుచున్నాఁడు.)

సుబ—(ఆవైదులచేతులు పట్టుకొని) మీరు మంచిసమయంలో వచ్చినారు. మీరాక నాకు బహుసంతోషంగావున్నది.

సదా—నాకూ సంతోషంగానేవున్నది.

గజా—నాకూనూ.

సుబ—మీరు యిటువంటి ఘనవైద్యులన్నమాట నాకు మొట్టమొదట తెలియలేదు. మీరు యిద్దరూ ధన్వంతరియొక్క అపరావతారాలు.

సదా—ఈచిన్నవాడు చాలాబుద్ధిమంతుడులాగు కనపడుతూవున్నాడు.

గజా—అయ్యో! మీరు మహాసరస్సులు.

మతి—(వారి కంఠస్వరముగుఱుతుపట్టి) ఓసదానంద యోగీ! గజాననదాసా! మీరు యిదిచూచినారుగదా? నన్ను మీరు చూడ గలరుగాని మిమ్మలిని నేను చూడలేను. మాయింట్లోవున్న వారందరికీ వక్కసారిగా పిచ్చియెత్తిపోయింది. ఈపళుప్రాయుడు పోలీసువాడి వేషంవేసుకునివచ్చి నన్ను కట్టివేసినాడు.

సుబ—అయ్యో! మా మామగారు యెటువంటిదురవస్థలో వున్నారో మీరు చిత్తగించినారా?

రాము—యెవరికీ హానికలుగకుండా తన్ను కాపాడుతూవున్న వాణ్ని నన్ను యెలాగు దూషిస్తూవున్నారో చూచినారా?

సదా—ఇదుగో వచ్చి చూస్తాము. (అని వారిద్దరును చేరువకు రాఁగా రాముఁడు ముందుకు వచ్చుచున్నాఁడు.)

మతి—ఇప్పుడు కన్నులయెదటికివచ్చినావు. ఇఖ యోగదృష్టితో చూచి నిన్ను నిముషంలో నాస్వాధీనం చేసుకుంటాను. (అని రాముని వంక రెప్పవాల్చక చూచుచున్నాఁడు.)

రాము—మీమంత్రం పారకుండా నేనూ మిమ్మలిని యోగ దృష్టితో చూస్తాను. (అని గ్రుడ్లు పెద్దవిచేసి తేఱిపారచూచు చున్నాఁడు.)

సదా—(మతిమంతుని వంకచూచి) ఈయన వెఱ్రిచూపులు చూస్తూవున్నాడు. గుడ్లు పెద్దవయినవి. ఇది పిచ్చకావడానికి సందేహం లేదు. నేను మొదటినుంచీ యీయనకు యెప్పుడో పిచ్చయెత్తుతుందనే అనుమానపడేవాణ్ని.

గజా—(మతిమంతుని తేఱిపారచూచి) ఆ ముఖచిహ్నాలనుబట్టి చూస్తే యిది భూతావేశంగా తోస్తూవున్నదిగాని చూపులలో పిచ్చ లక్షణం యెంతమాత్రమూ కనపడడంలేదు.

సదా—మనం నాడికూడా పరీక్షచేసిచూతాము.

రాము—అయ్యా! వైద్యులు చెయ్యిచూస్తారట. మీచెయ్యి నక్కమాటు చాపండి.

సదా—అయ్యా! కుడిచెయ్యి యిలాగివ్వండి. (అని మణికట్టు పట్టుకొనుచున్నాఁడు.)

గజా—ఎడమచెయ్యి నాచేతికియ్యండి. (అని పట్టుకోఁబోవు చున్నాఁడు.)

మతి—(చేయివదల్చుకొని గింజుకొనుటచేత కట్టినత్రాళ్ళు కొంచెము వదులుకాఁగా కుర్చీతోలేచి) ఓముసలిగాడిదె కొడుకుల్లారా! మిమ్మలిని యిద్దరినీ తలబద్దలుకొడుతాను వుండండి. నాకుకాదు మీకే పిచ్చమెత్తింది. అని యిద్దఱిని చెఱియొక గుద్దును చేయఁగా వారు పరుగెత్తుచున్నారు.)

రాము—(మతిమంతుని కుర్చికాళ్ళు పట్టుకొని వెనుకకు లాగుచు) మీకు భయంలేదు. మెల్లిగా పరుగెత్తండి.

మతి—పిచ్చికుక్కలకొడుకుల్లారా! పారిపోకండి. (అని కుర్చీతో రాముని వారికేసి యీడ్చుచు రాముఁడును తానును ముందుకు పడు చున్నారు.)

సుబ—అయ్యో! (అని నవ్వాపట్టలేక నోటికి చేయడ్డము పెట్టు కొని క్రింద కూలఁబడుచున్నాఁడు.)

సుమ—అయ్యో! (ఏడ్చుచు తండ్రికి సహాయపడుటకు పరుగెత్తు చున్నది.)

రాము—నామోకాళ్ళు విరిగిపోయినవి. (అని లేచి సుమతి సహాయముతో మతిమంతుని కుర్చీకట్లు విప్పుచున్నాఁడు.)

సుమ—బాబయ్యగారూ! మీకు దెబ్బతగలలేదుగదా? సుబలా! నీవు వట్టి అల్లరివాడవయినావు. (రాముని మొగమువంకచూచి) ఓస్సి! వీడు మనరాముడేనా? తలగుడ్డా వేషమూ చూచి యెవరో అనుకున్నాను.

మతి—(మెల్లగాలేచి) రాముడా? వీడికీ చేటుకాలం వచ్చిందేమి? యిందులో యెదోకుట్రవున్నది. (వెనుకతిరిగి సుబలుఁడు నవ్వుచుండుట చూచి) ఆ పిచ్చికుర్రవాడు యేలా నవ్వుతూవున్నాడో? ఇదంతా అతనిపని అయివుంటుంది.

సుబ—మామా! మీకు వెయ్యి నమస్కారాలుచేస్తాను. ఈపని చేసినందుకు నన్ను క్షమించండి. మీదగ్గిరచేరేవాళ్ళూ మీ దగ్గిర యోగమనీ మంత్రాలనీ మాట్లాడేవాళ్ళూ యెటువంటివాళ్ళో చూపించడానికి నేను యీపనిచేసినాను.

మతి—(తనలో) వీడు మహాతెలివయినవాడుగా కనపడుతూవున్నాడు. (బిగ్గరగా) అబ్బాయీ! యిక యీవైద్యులనిద్దరినీ మన యింటికి యెప్పుడూ రానియ్యను. నేను నీవన్నట్లు యోగపుపిచ్చ మానివేసి తెలివిగలిగి వుంటాను.

రాము—వీరిద్దరూ సఖ్యపడ్డారు. ఈయన నాతాళం పట్టిస్తాడు. దూరంగా వెళ్ళవలెను.

మతి—(రామునిజూచి) పోకు. ఆగు. నీకు యేమిశిక్ష చెయ్యవలెనో నాకు తెలియకుండావున్నది.

రాము—ఈచిన్నవాడిదిగాని యిందులో నాతప్పితం యెంతమాత్రమూలేదు.

మతి—చాలును. ఈపాటి నోరుమూసుకో. నిన్ను పనిలోనుంచి తీసివెయ్యవలెను.

[అంతట గౌరి ప్రవేశించుచున్నది.]

గౌరి—అయ్యో! మీరు నామనవి చిత్తగించవలెను.

మతి—ఓరీ! నీవీగౌరిని పెళ్ళాడుతావా? నిన్ను క్షమిస్తాను.

రాము—ఏమి? గౌరీ! నన్ను పెళ్ళిచేసుకుంటావా?

గౌరి—అయ్యగారి యిష్టంవుంటే నేనువద్దంటే మానుతుందా?

మతి—(తనలో) బావా మరదలూ వాళ్ళు యెట్లా మాట్లాడు కుంటూవున్నారో!

సుబ—మామగారూ! మీ స్నేహితులను పంపించి వారిచేత నన్ను కావలసినన్ని ప్రశ్నలు వేయించినారు. యిమ్మాలిని నేనువక్క ప్రశ్న వేస్తాను. దానికిజవాబు చెప్పండి. మీకొమార్తెను నాకుయి స్తారా యివ్వరా చెప్పండి.

మతి—అమ్మాయీ! యిదేమిటి? ఇతని జబ్బుసంగతి నీ వెరుగు దువుగదా?

సుమ—ఆ విషయంలో నాకేమీ భయంలేదు. నేను వుపచా రంచేస్తూవుంటే యితని కన్నీ పిచ్చిలూపోతవి.

సుబ—ఆమాటనిశ్చయం. మీరావిషయంలో యేమీభయ పడవలసిన పనిలేదు. యిప్పుడు నేనుమీకు మంచివాణ్ని కాననితోస్తే యిఖముందైనా మీచేత నిజంగా మంచివాణ్ననిపించుకోవడానికి ప్రయ త్నంచేస్తాను. నానడతవల్లనే మీకన్నీ తెలుస్తవి.

మతి—అమ్మాయీ! నీచుట్టూపిచ్చికొడుకులనూ పిచ్చికూ తుళ్ళనూ పెట్టుకోవడానికి నీకు యిష్టంవున్నట్లయితే నీకోరికకు నేను యేమీఅడ్డంచెప్పను. ఇంతలేసీ యింతలేసీ పిల్లవాళ్ళను నేనునిత్యమూ యోగదృష్టితో చూస్తూ యీకంటితో యిద్దరినీ ఆకంటితో యిద్దరినీ శాంతపరుస్తూవుంటాను. నా యోగమహిమ లోకానికి కనపరచడానికి నాకుముందు మంచి అవకాశం కలుగుతుంది. (సుమతిని సుబలుని చేతి

యొకచేతితోను నిమురుచు) బిడ్డలారా! మీరు దీర్ఘాయుష్మంతులయి సుఖపడండి.

రాము—(గారిచేయిపట్టుకొని ముందుకువచ్చి) అయ్యా! మీరు మమ్మలిని కూడా వక్కమాటు ఆశీర్వదించండి. యిదే నాకు మీఆఖరు దీవెన. ఇదివరదాకా స్వతంత్రంగా వుండేవాణ్ని. ఇప్పుడు యీగౌరమ్మ చేతులో పడ్డాను. యిది యికనన్ను నగలు తెమ్మని చంపుతుందో బ్రతికిస్తుందో దేవుడికి తెలియవలెను. మీకు నాచావు తప్పించవలెనని వున్నట్టయితే రెండువందలరూపాయలు ఇవ్వండి. నగలు చేయించుకుంటాము. మీ పాత తాటాకుల పుస్తకాలు వకకావిడి నాకు దయచేసినారంటే యీ శీతాకాలము చలిమంట వేసుకుని మీరు పెళ్ళిచేయించినందుకు మీ పేరుచెప్పుకుని సుఖపడుతాము. అప్పటితో నాకునిత్యమూ పురుగులు దులపవలసిన బాధకూడా విరగడై పోతుంది.

మతి—ఓరి మోటపశువా! పవిత్రమైన పుస్తకాలవిషయమై అటువంటి మాటలంటే పాపంవస్తుంది. వూరుకో.

సుమ—రామా! బాబయ్యగారి మనసునొచ్చే మాటలనకు మావివాహం అయిన తరువాత మిమ్మలిని ఇద్దరినీ మాదగ్గిర వుంచుకుని నీపెళ్ళాము నిన్ను మింగివెయ్యకుండా కాపాడుతాములే.

సుబ—మామగారూ! మీరునన్ను నిష్కారణంగా పిచ్చవాణ్ని చేసినారు. అందుచేత నేను మిమ్మలిని మళ్ళీపిచ్చవాణ్ని చేసినాను. వంతుకువంతు సరిపోయింది. క్షమించి ఇఖమీరు చెయ్యవలసినపని శీఘ్రంగాచేయించండి.

మతి—రండి లోపనికి వెళుదాము. రామా! నీవు బంధువులకందరికీ శుభలేఖలు తీసికొని వెళ్ళవలెను. రేపు ప్రయాణానికి సిద్ధంగావుండు.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

మోడరన్ప్రెస్, కలర్ప్రింటర్స్ & బాక్సు మేకర్స్, రాజమండ్రి.

మహావంచక ప్రహసనము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

మూడవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,

రాజమహేంద్రవరము

1950

[వెల రు. 0-4-0

మహావంచకప్రహసనము

ఇందు వచ్చు పాత్రములు.

జియ్యరుసూరి—ధనికుఁడగు నొక చైతన్యమతస్థుఁడు.

దామోదరుఁడు—జియ్యరుసూరి సేవకుఁడు.

నారాయణుఁడు—కంఠీరవదేవుని సేవకుఁడు.

శ్రీమన్మహామండలేశ్వర కంఠీరవదేవు—రామామణి ప్రియుఁడు.

వంచకాచార్యులు—కంఠీరవదేవుని కల్పితజనకుఁడు.

భవానిసింగు—రాజభటుఁడు.

శివప్రసాదు—రాజభటుఁడు.

రామామణి—జియ్యరుసూరి కూఁతురు.

పార్వతి—జియ్యరుసూరి దాసి.

---

౧. రంగము—బృందావన పురములోని జియ్యరుసూరి యిల్లు.

[దామోదరుఁడును పార్వతియు ప్రవేశించుచున్నారు.]

దామో—ప్రొద్దున్నే లేవడంవల్ల యెంతలాభం వున్నదో చూచినావా? యెవరయినా చూచిపోతారనే భయంలేకుండా మనం స్వేచ్ఛగా సరసాలాడుకుంటూ వున్నాము.

పార్వ—మన యజమానుడుగారు లేచివచ్చేవేళ అయింది. యీసమయంలో యిక్కడకువస్తే యేమనుకుంటారు?

దామో—ఆయన మన యిద్దరికిపెళ్ళీ చెయ్యావలెననుకుంటారు. ఆయన యేమనుకుంటేయేమిలే. నేను అనేదాన్నివిను. నేను యిక్కడ

పనిచేస్తూవున్న ఫదిసంవత్సరాలలోనూ నాజీతంలోనుంచీ నాహస్తలాఘవంచేతనూ నూఁరురూపాయలుకూడ బెట్టినాను. అనుభవించేవారు లేకపోతే పదేళ్ళనుంచీ కూడబెట్టిన యీసొమ్మంతా వ్యర్థమయి పోతుంది.

పార్వ—నేను అనుభవిస్తాను. ఆసొమ్ము నాకియ్యి.

దామో—వూరికే అనుభవించడంకాదు. నీవు నాతోకలిసి అనుభవించవలెను.

పార్వ—మనం యిద్దరమూఁకలిసే అనుభవింతాము. మనఅమ్మగారు కంఠీరవ దేవుడిగారిని మోహించిన సంగతి నీవువిన్నావా?

దామో—ఆవిడె కతనిమీద మోహంవున్నసంగతి యెరుగుదునుగాని, అయ్యగారావివాహానికి వప్పుకోరు. ఆయనకు యీసంగతి తెలియడంతోటే—

జియ్యరుసూరి—(వెలుపలినుండి) దామోదరా. మొఖంకడుక్కోవడానికి నీళ్ళు.

దామో—అరుగో అయ్యగారులేచినారు. వీడు నాకంటికి మన్మధుడులాగువున్నాడు పైత్యహరమని అయ్యగారు ప్రొద్దున్నే పెసరట్టు ఫలహారంచేస్తారు. నేను అన్నీ సిద్ధంచెయ్యవలెను. అడుగో టపాబంట్రోతు దొడ్డితోవను వుత్తరంతీసుకునివచ్చినాడు. ఇది రామామణిగారికి కంఠీరవదేవుడుగారు పంపించినదయివుంటుంది. నేను వెళ్ళి పుచ్చుకుంటాను. (అని వెళ్ళుచున్నది.)

[దామోదరుఁడు వెంటరాఁగా జియ్యరుసూరి ప్రవేశించుచున్నాఁడు.]

జియ్య—దామోదరా!

దామో—అయ్యా!

జి—యేమీలేదు. నీతో చెప్పకూడదు. పెసరట్టయిందా?

దా—అయింది. అయ్యా! నాతో—

జి—నీతోచెప్పను. విస్తరితీసుకునిరా.

దా—చిత్తం. దయచేసి—

జి—వూరుకో. రొట్టెలు తీసుకునిరా.

దా—తీసుకువస్తాను.

జి—వచ్చేటప్పుడు రాత్రివచ్చిన వృత్తాంతపత్రికకూడా తీసుకునిరా.

దా—చిత్తం. (అని వెళ్ళుచున్నాఁడు.)

జి—(పీటమీఁద కూరుచుండి) నేను యీవూరికివచ్చి యీ తోటయింట్లో ప్రవేశించి ఖులాసాగావున్నాను. ఆపెద్దమేడలోవున్నప్పుడు నన్నందరూవచ్చి డబ్బుకోసం వూరికే బాధపెడుతూ వుండేవారు. ఈయిల్లు వూరిచివరను మారుమూలను వుండడంచేత యిక్కడకు అట్టేమందిరారు. అడుగో దామోదరుడు వార్తాపత్రికపట్టుకుని వస్తూవున్నాఁడు.

[దామోదరుఁడు పెసరట్లును, వృత్తాంతపత్రికయు, ఉత్తరమును పట్టుకొని ప్రవేశించుచున్నాడు.]

దా—పెసరట్లు—

జి—పెసరట్లు కిందపెట్టి పత్రికముందుగా యిలా ఇయ్యి. (అని పుచ్చుకొనుచున్నాఁడు.)

దా—అయ్యా! పెసరట్లుచాలునా? యింకా రెండు తేనా?

జి—చాలును. వకటి యిలా చేతికందియ్యి. (అని పత్రికవిప్పి చదువుచున్నాఁడు)—"ఇప్పుడు కొత్తమోస్తరు మోసాలు మాహా యెక్కువవుతూవున్నవి. కాకినాడలో వారంరోజులకిందట మంచిబట్టలు

కట్టుకొని గోపాలదాసని పేరుపెట్టుకుని బంధువుడనని వక్క పెద్దమనిషి యింట్లో ప్రవేశించి వారియింట్లో భోజనంచేసి తరువాత వారియింట్లో వున్న వస్తువులు కొన్ని యెత్తుకొని వకడు పారిపోయినాడు. అతని జాడ యింకా యేమీ తెలియలేదు. దర్యాప్తుచేయ్యగా అతని నిజమయినపేరు వంచకాచార్యుడనిన్నీ, అతను యింకా అనేకచోట్ల యిటువంటి మోసాలుచేసినాడనిన్ని పోలీసువారికి తెలియవచ్చింది."— ఇది వట్టి పాడుప్రపంచము. అందరూ మోసగాళ్ళుగానే కనపడుతూ వున్నారు. యెవరినీ నమ్మకూడదు. మనం బహుజాగ్రతగా వుండవలెను. (అని రొట్టెనమలుచు) దామోదరా! మంచితీర్థం తీసుకునిరా.

దా—మీపీటదగ్గిరనే పెట్టినాను. తమరు సెలవిచ్చినట్లు యీ లోకం వట్టిపాడులోకంగా కనపడుతూవున్నది. యిఖ యీలోకం వదలిపెట్టి మరియెక్కడికైనా లేచివెళ్ళవలెను.

జి—రొట్టెలు బాగావున్నవికావు. వీటిని తీసుకునివెళ్ళు. నీచేతిలోది యేమిటి?

దా—ఇదా? వుత్తరం. టపాబంట్రోతు యిప్పుడే తీసుకుని వచ్చినాడు.

జి—(చేతితో పుచ్చుకొని) ఈవుత్తరం నాకేనా?

దా—కాదు. అమ్మగారికండి.

జి—అమ్మాయిదా? ఇది దానిప్రియుడు వ్రాసిందయివుంటుంది.

దా—అందుకు నాకేమీ సందేహంలేదు.

జి—నీకు సందేహం యెందుకువుండవలెను? నీవువెళ్ళి మా అమ్మాయిని వెంటనే యిక్కడికి పంపించు.

దా—చిత్తం. (అని వెళ్ళుచున్నాఁడు.)

జి—వీడు పూరికే అధిక ప్రసంగం చేస్తాడు. యిఖముందు వీణ్ని విస్తారం మాట్లాడకుండా వుండేటట్టుచేసి యేప్రశ్న అడిగితే ఆప్రశ్నకు మాత్రమే. జవాబుచెప్పేటట్టు చెయ్యవలెను. అదుగో! అమ్మాయి వస్తూవున్నది.

[దామోదరునివెంట రామామణి ప్రవేశించుచున్నది.]

రామా—నాన్నగారూ! మీవద్దకు నాదియేదో వుత్తరంవచ్చిందట. యిప్పిస్తారా?

దా—వుత్తరంవచ్చిన సంగతి నేనే యీమెతో చెప్పినాను.

జి—నీవే చెప్పినావు గనుక నీవే అనుభవించు.

(అని నెత్తిమీద రెండుదెబ్బలు వేయుచున్నాఁడు.)

దా—నేను యిఖ యెప్పుడూ చెప్పను. పారి పోతాను. (అని పరుగెత్తుచున్నాఁడు.)

జి—అమ్మాయీ! యిదుగో నీవుత్తరం. యీవుత్తరాలసంగతి నాకు బాగా తెలుసును. కాముకులువ్రాసే యిటువంటి వుత్తరాలను నమ్మి నీవుయెప్పుడూ మోసపోవద్దు. లోకానుభవం తెలిసిన పెద్ద వాణ్ని గనుక నీకు బుద్ధిచెపుతూ వున్నాను.

రామా—(తనలో) అలాగయితే యిదికంఠీరవదేవుగారు వ్రాసిందని యీయనకు తెలిసింది కాబోలును.

జి—యిందుకోసం నాకు నీమీద కోపంలేదు. యిది యెవరు వ్రాసిందో చెప్పు. నాకు అంతేచాలును.

రామా—మీతో అంతా చెపుతాను. యీవుత్తరం వ్రాసిన ఆయన బహుగొప్పవాడు. నిజమయినప్రేమచేతనే నన్ను వరించినాడు. ఆయనపేరు—

[కేకలువేయుచు దామోదరుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దా—శ్రీమన్మహామండలేశ్వర కంఠీరవదేవుగారు

రామా—ఆయన యిక్కడికే వచ్చినారా? అలాగయితే నేను వెళ్ళవలెను. (అని వెళ్ళుచున్నది.)

జి—మహామండలేశ్వరుడా? అలాగయితే ఆయనను వెంటనే దయచెయ్యమని చెప్పు.

దా—చిత్తము. (అని వెళ్ళుచున్నాఁడు.)

జి—మహామండలేశ్వరుడైతే చాలా గొప్పవంశంలోవాడై వుంటాడు.

[కంఠీరవదేవు ప్రవేశించుచున్నాఁడు]

కంఠీ—జియ్యరుసూరిగారూ! నేడు బహుసుదినం. తమదర్శనం దొరకడంవల్ల నాకు బహుసంతోషంగా వున్నది.

జి—నేను ముసలివాణ్ని యీగౌరవానికి నేను అర్హుణ్ని కాను. మీవంశంలో మీరే కడపటివారనుకుంటాను.

కం—దురదృష్టవశంచేత నేనేయిప్పుడు కడపటివాణ్నయి మిగిలివున్నాను. మాపెద్దలందరూ దైవవశంచేత వక్కరూలేకుండా కాలంచేసినారు. నాపేరు యీదేశంలోవుండే రాజసభలలో యెంత ప్రసిద్ధికెక్కినదయినప్పటికీ, నేను వివాహంచేసుకోక పోయినట్టయితే మావంశమునాతోనే నష్టమయి పేరులేకుండా పోతుంది. మీఅనుమతిని పొంది మీకొమార్తెను భార్యనుగా గ్రహించవలెననే వుద్దేశంతో నేను యిప్పుడు తమదర్శనానికి వచ్చినాను.

జి—నేను వక్కటి చెప్పుతానువినండి. యెంతగొప్పవంశంలో పుట్టినవాడయినా డబ్బులేకపోతే యేమీ ప్రయోజనంలేదు. నాచిన్న

తనంలో నేను బీదతనంవల్ల బహుకష్టాలుపడి వున్నవాడను గనుక డబ్బులేనివాడికి యెవరికీ నాకూతురిని యివ్వకూడదని నిశ్చయంచేసుకున్నాను. మీకుతగినంత ధనంవున్నట్టు మీరు నాకు తృప్తికరంగా కనపర్చేటట్టయితే పిల్లదాన్ని మీకుయిచ్చి వివాహంచెయ్యడానికి నాకుయేమీ అభ్యంతరంలేదు. యీపని మీరుచేసేవరకూ మీరు మళ్ళీ మాయింటికి రావలసిన పనివుండదు.

కం—అదెంతభాగ్యము? నేనుయిప్పుడు ప్రమాణంచేసిచెపుతాను.

జి—ప్రమాణాలూ గిమాణాలూ నాకుయేమీ పనికిరావు. ఆ వ్యాపారం నేను చాలాకాలం క్రిందటనే కట్టిపెట్టినాను.

కం—(తనలో) ఇప్పుడీ ముసలివాడితో అసాధ్యంవచ్చింది. ఇప్పుడుయేమి చెయ్యను. యెలాగయినా యితణ్ని మోసం చెయ్యవలెను. (బిగ్గరగా) దైవానుగ్రహంవల్ల నాకు కావలసినంతధనమూ వసతులూ వున్నవి. నాయిష్టంవచ్చినప్పుడల్లా వెళ్ళివుండడానికి మాపూళ్ళో నాకు గొప్పరాజభవనంవున్నది. (తనలో) సెంట్రల్ జయిలు తప్పకుండా రాజభవనమే.

జి—అంతేనా? యింకా యేమయినా వున్నదా.

కం—మంచియిల్లూ ఫలవృక్షములూవున్న వుద్యానవనం వకటికూడావున్నది. (తనలో) చిత్రవస్తు ప్రదర్శనశాలా, తోటా పట్నంలోవారి అందరిహక్కు గనుక అందులో నాకుకూడా హక్కువున్నది.

జి—మీకు భూములు యేమయినా వున్నవా?

కం—వందలకొద్ది కానులున్నవి. (తనలో) వక్కకానిభూమైనా నాకులేకపోయినా అయిదు రూపాయల డబ్బులు మొన్ననే మార్పించినాను గనుక మూడువందల కానులు పయిగావున్నవి.

జి—అది సరేకాని మీవద్దరొక్కం మెంతవున్నది?

కం—అదిఇంతా అంతా అని నేను చెప్పలేను. (తనలో) యేమీలేనప్పుడు యింతని యెలాచెప్పగలను? ఆవున్నడబ్బులలోనైనా కొన్ని వాడుకున్నాను గనుక యిన్నని సరిగ్గా చెప్పలేను.

జి—అయిపోయింది. యిఖ వక ప్రశ్నమాత్రం అడుగుతాను. యీఆస్తంతా మీకు యెలాగువచ్చింది?

కం—మాతండ్రిగారివల్ల వచ్చింది. ఆయన యిప్పుడు యీ ఆస్తంతా అనుభవిస్తూ గోదావరీతీరంలో రాజమహేంద్రవరంలో వున్నారు.

జి—ఇంతకుముందు మీరు మీవంశంలో మీరేకడపటివారని చెప్పినట్టున్నారే.

కం—అవును. ఆయన వక్కడుపోతే నేనేకడపటివాణ్ని. అదంత ముఖ్యమయిందికాదు. ఆయనవున్నా లేనట్టే. ఆయనసంగతే నేను మరచిపోయినాను. ఆయన బహుముసలివాడు.

జి—ఆలాగైతే మీరు మీతండ్రిగారిని వక్కపర్యాయం ఇక్కడకుపంపిస్తే ఆయనా నేనూ మాట్లాడుకొని సంబంధనిశ్చయం చేసుకుంటాము. అప్పుడు మా చిన్నదాన్ని మీరు వివాహం కావచ్చును.

కం—అయితే—

జి—అయితేగియితేలు నావద్దపనికిరావు. నేను ఖండితంగా మాట్లాడుతూవున్నానని కోపగించుకోక మీతండ్రిగారిని వక్కపర్యాయం తీసుకురండి. నాకు పనివున్నది. నేను వెళుతాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

కం—ఇదంతో నా తెలివితక్కువ మాటలవల్ల తటస్థమయింది నేను యేదియెలాగైనా రామామణిని సంపాదించుకోవలెను. సంపా

దించుకుంటాను. పెళ్ళాన్ని సంపాదించుకోవడం కంటెముందుగా నేను యిప్పుడు తండ్రిని సంపాదించుకోవలెను. నా కుయిప్పుడుఅర్థాత్తుగా తండ్రి యెక్కడదొరుకుతాడో యేమీ తెలియకుండావున్నది. యెవరికోవకరికి వేషంవేసి ప్రస్తుతం వకతండ్రిని యెరువు తెచ్చుకోవలెను.

[నారాయణుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కం— నీకు యిక్కడ యేమికావలెను?

నారా—నాకేమీ అక్కరలేదు. మీ కేమైనా కావలెనా?

కం—కావలెను. నాకు తక్షణం వకతండ్రి కావలసివున్నాడు. నారాయణా! ఇందులో నీవు నాకు సహాయం చెయ్యవలెను.

నారా—రెండేళ్ళబట్టి మీవద్ద నన్ను నవుకరీవుంచుకుని మీకు తండ్రికావలసివున్నమాట వక్కనాడూ చెప్పినారుకారే.

కం—అప్పటిమాటంతా యెందుకు? ఇప్పుడు చెప్పినాను తీసుకునిరా. వ్యర్థంగా కాలక్షేపంచెయ్యకు.

నా—నాకు యిప్పుడు ఆకలివేస్తూవున్నది. నాఆకలి తీరితేనే కాని నేను యిప్పుడు యేపనీచెయ్యలేను.

కం—నీవాసత్రంలో భోంచేసిరాలేదా!

నా—యెలా భోంచేస్తాను! అన్నంపెట్టిస్తాను వాకిట్లోవుండుమని నన్ను కూర్చోపెట్టి మీరు లోపలికివెళ్ళి భోజనంచేసి దొడ్డిలోనను పరుగెత్తివచ్చినారు. నా సంగతి ఆమహాసత్రంలో కనుక్కునేవారెవరు? నేను కడుపుకాలుతూ కూర్చుని కూర్చుని మీరు వెళ్ళినారనివిని మీ జాడ వెతుక్కుంటూ యిక్కడికి పరుగెత్తుకొని వచ్చినాను.

కం—చీఛీ నోరుమూసుకుని వూరుకో. వక్కపూట భోజనం లేకపోతే యింత బ్రహ్మాండంచేస్తూ వున్నావు! స్వామిభక్తిగల సేవ

కుడు యెన్ని వుపవాసాలు చేసిఅయినా స్వామికార్యం నిర్వహించ వలెను. నీవు ప్రయత్నంచేసి నాకు వక్క తండ్రిని సంపాదించి పెట్టినా వంటే దానితో నీదరిద్రమూ నా దరిద్రమూకూడా విరగడై పోతుంది.

నా—అలాగైతే మీకుతండ్రి అసలేలేడా?

కం—వున్నాడు. కాని నేను తండ్రినని పయికిచ్చి చెప్పేవాడు యిప్పుడు యెక్కడా కనపడకుండా వున్నాడు.

నా—అలాగైతే ఇఖ మీకు తండ్రి దొరకనేదొరకడు.

కం—పోనీ. నీవు నాతోకూడారా. మనం యిద్దరమూ కలిసి తండ్రికోసం వెతుక్కుంటూ వెళుదాము.

నా—యెక్కడికి వెళుదాము?

కం—యెక్కడికా? మక్కాకు పోదాము. రా. (అని వెళ్ళు చున్నాడు.)

నా—నాకు యెక్కడకుపోయినా యింతకంటె నష్టంరాదు. వెళుతాను. (అని వెళ్ళుచున్నాడు.)

౨. రంగము—ఊరిబయిలి రచ్చచావడి.

[అటుకులు తినుచు వంచకాచార్యులు ప్రవేశించుచున్నాడు.]

వంచ—ఎవరో వస్తూవున్నట్టున్నారు. ఇక్కడినుంచి వేగిరం పారిపోవలెను. అక్కరలేదు. ఉండవచ్చును. నాఅంతటి బుద్ధిమంతుడికి భోజనంలేకుండా యీబండమీద కూర్చుండి అటుకులు తినవలసిన యోగంపట్టింది. ఆవచ్చేవారు యెవరయివుందురు. ఇతడు విచారం చేతనో సంతోషంచేతనో మనసుకు యేదోవుద్రేకం కలిగినవాడుగా కనపడుతూవున్నాడు. నాపాలిటి భాగ్యదేవత మోసంచేసి వక్క

పూట తిండికయినా యితనివద్ద సంపాదించుకోవడానికి యితణ్ని యిక్కడికి పంపివుంటుంది.

[కంఠీరవదేవు ప్రవేశించి, వంచకాచార్యులక్కడనున్న ట్టే చూడక ముందుకును వెనుకకును నడుచుచున్నాడు.]

కంఠీ—నాకు తండ్రియెలాగు దొరుకుతాడు?

వంచ—(తనలో) తండ్రా!

కం—వక్కతండ్రి దొరికితే నాకు రామామణీ ధనమూకూడా దొరుకుతుంది. తండ్రిదొరక్కపోతే భార్యాపోతుంది చెరసాల ప్రాప్త మవుతుంది. నాకు యేమీతోచకుండా వున్నది.

వం—(ముందుకువచ్చి తనలో) యీపెద్దమనిషి యేదో చిక్కులో వున్నట్టుకనపడుతూవున్నాడు. (బిగ్గరగా) అయ్యా! మీరు యేదోకష్టంలోవున్నట్టున్నారు. మీకు నావల్ల సహాయం యేమయినా కావలసివున్నదా?

కం—నీకంఠస్వరం నేను తరుచుగా విన్నదిలాగున్నది. మనం యిద్దరమూ యెక్కడనో వక్కచోట కలిసివున్నట్టున్నది. చుట్టలు యెగుమతీచేసి కోస్తాలనుంచి బంగారపుయిసుక తెప్పిస్తామని కాకినాడలో పెద్దమేడలోపెట్టిన కంపినీకి మీరు కార్యనిర్వాహకులుగా వుండలేదా?

వం—అవును. ఆకంపెనీలో భాగస్థుడుగా చేరుమని మీతో చెప్పినాను. మీరు వున్నారుకారు.

కం—వుండలేదు. నేనుపుట్టి బుద్ధియెఱిగితరువాత చేసిన తెలివి గల పని అది వక్కటే అని తలుస్తాను. తరువాత ఆ కంపినీస్థితి యేమయింది?

వం—లక్షరూపాయల మూలధనంగల ఆ కంపెనీవారు యింటి అద్దె నిమిత్తం వ్యాజ్యంవచ్చేటప్పటికి హాజరువారంటు వస్తుందేమోనని నానాముఖాలా పారిపోయినారు. నేను కార్యనిర్వాహకుణ్ని గనుక, ఆకంపెనీవారికి ముందుగా నేనేదారిచూపి పారిపోయినాను. అప్పటి నుంచీ నేను నాస్వార్జితధనంవల్లనే జీవనంచేస్తూవున్నాను.

కం—కంపెనీ దివాలా తీసినతరువాత మీావద్ద ధనంయెలాగు వచ్చింది?

వం—అప్పటినుంచీ నేను జనులను లోకోపకారం నిమిత్తం అనేక విధాల మోసాలుచేసి ధనం సంపాదించి జీవనం చేస్తూవున్నాను.

కం—యిది మరీవింతగావున్నది. మోసం చెయ్యడంవల్ల లోకోపకారం యెలా తటస్థమవుతుంది?

వం—చెపుతానువినండి. లోకంలోవుండే జనులందరూ మోస పుచ్చేవారూ మోసపోయేవారూ అని రెండు తెగలుగా వుంటారు.

కం—ఇదిమంచి విభాగమే.

వం—లోకంలో మోసంచేసే బుద్ధిమంతులు తక్కువగానూ మోసపొయ్యే బుద్ధిహీనులు యెక్కువగానూ వుంటారు. బుద్ధిమంతుల వల్ల బుద్ధిహీనులకు వుపకారం కలుగుతుంది. గనుక, అల్పసంఖ్యగల వంచకులవల్ల అధికసంఖ్యగల వంచితులకు వుపకారం కలుగుతుంది. అనగా బహుజనోపకారం కలుగుతుందని తాత్పర్యం.

కం—అదియెలాగు?

వం—మీాకు విప్పిచెపితేనేకాని తెలిసేటట్టులేదు. చెపుతాను వినండి. పెద్ద కంపెనీకి కార్యనిర్వాహకుణ్ని గనుక పెద్దషాపులోకివెళ్ళి పదికోట్లుకు గుడ్డచింపించి కుట్టించి తయారుచేయించి బిల్లుతో కోట్లు మాయింటికి పంపవలసిందని ఆర్డరు యిస్తాననుకో. ఆర్డరుప్రకారంకోట్లు

వస్తవి. నావద్దనుంచి షాబుకారుకు వక్కదమ్మిడీ వెళ్ళను. దర్జీవాడు కుట్టినందుకు షాబుకారువద్ద కూలి పుచ్చుకోకుండా వుండడుగనుక ఆ కూలితో వాడిపెళ్ళాలూ బిడ్డలూ భోజనంచేస్తే కుటుంబానికంతా వుపకారం కలుగుతుంది. వాడు కావలసినవస్తువులు బజారులో కొంటాడుగనుక వాళ్ళందరకూ వుపకారం కలుగుతుంది, వాడు సాయంకాలం మిగిలినసొమ్ము పట్టుకుని కల్లంగడికి వెళుతాడు గనుక అక్కడ వాళ్ళకు వుపకారం కలుగుతుంది; అక్కడ తాగిపడిపోతే పోలీసువారు పట్టుకుంటే నేరాలు పట్టుకున్నందుకు పోలీసువారికి వుపకారం కలుగుతుంది; మరునాడు మేజస్ట్రీటు జులుమానావేస్తే గవర్నమెంటువారికి లాభం కలుగుతుంది; యిలాగంటి వ్యవహారాలవల్ల వర్తకుడు దివాలా తీస్తే భగవద్భక్తికలిగి అతనికి వుపకారం కలుగుతుంది; యిలాగుచెప్పడానికి మొదలుపెడితే యెన్ని వుపకారాలయినా చెప్పవచ్చును. నా వక్కమోసంవల్ల ప్రజలు మొదలుకుని దొరతనంవారివరకూ యెంత మందికి వుపకారం కలిగిందో కనిపెట్టినారా!

కం—మోసంవల్ల యిలాగంటి లోకోపకారం వుంటుందని నేనిదివరకు యెప్పుడూ ఆలోచించలేదు. (తనలో) దీన్నిపట్టిచూస్తే యితడు నాకు తండ్రిగావుండడానికి తగినవాడుగానే కనపడుతూవున్నాడు. (బిగ్గరగా) మీరిదివరకెప్పుడయినా నాటకంలో వేషంవేసి కథనినిపించినారా?

వం—మీరో?

కం—మీరు యెప్పుడయినా తండ్రిగావున్నారా?

వం—నాకు పెళ్ళికాలేదుగనుక ఆప్రశ్న నన్నడగకండి. నిజం చెపితే అన్నితంటాలు వస్తవి.

కం—నాఅర్థం నిజమయినతండ్రి అనికాదు. మీరు నాటకంలో యెప్పుడయినా తండ్రివేషం వేసినారా?

వం—అదెంతసేపు? నిముషంలో వెయ్యవచ్చును. రెండుచొప్ప బెంట్లు పళ్ళుపెట్టుకొని మీసాలకూ గడ్డానికీ మర్రిపాలతో తెల్లబొచ్చు అంటించుకుంటే అరఘడియలో అరవయి తండ్రివేషాలు వెయ్యవచ్చును. ఆపయిని 'అబ్బాయీ! యెన్నాళ్ళకు నిన్నుచూచినానురా!' — (అని గట్టిగా కంఠీరవదేవుని కౌఁగిలించుకొని) — ఇలాగే. అంతా నాకు తెలుసును.

కం—దివ్యంగావున్నది. నీవునాకు తండ్రివి కాదగినవాడవే. నాకుతండ్రివి కావడానికి ముందుగా నీవునాకు వక్కచిన్నపని చేసిపెట్ట వలెను. నీవు యీపుత్తరం తీసుకునివెళ్లి సమీపంలోనే వకయింట్లో యిచ్చిరావలెను. (అని చెవిలో చెప్పుచున్నాఁడు.)

వం—అలాగే చేస్తాను.

కం—మామనిషిని వేరేవకచోటికి పంపించినాను. నీవు వచ్చినదాకా యిక్కడ కనిపెట్టుకుని వుంటాను.

వం—ఇదుగో వెళుతూవున్నాను. వక్కసంగతి అడగడంమరిచి పోయినాను. యీపూట మీభోజనం యెక్కడ?

కం—వెళ్ళిరా. తరువాత మనంయిద్దరమూ కలిసేభోంచేతాము

వం—కూరలు వుంటవా?

కం—వుంటవి.

వం—పప్పో?

కం—పప్పూను.

వం—నెయ్యో?

కం—నెయ్యీని.

వం—పెరుగో.

కం—అన్నీవుంటవి. వేగిరంవెళ్ళిరా. (అని వెళ్ళుచున్నాఁడు.)

న:—మనమోసం బాగాపారింది. ప్రపంచమంతా మోసం తోనే వున్నది. యెక్కడ చూచినా వీరిని వారూ వారినివీరూ మోసం చేస్తూవుంటారు.

(పాట—ద్విపద.)

1. పట్టణంబులయందు - పల్లెలయందు,
బిట్టుగాజనులెల్ల - భేదంబులేక,
వేసాలువేయుచు - వేయివిధాల,
మోసాలుచేయుచు - మురువొందుచుంద్రు.

2. అప్పిచ్చువారెల్ల - నధికాశచేత,
నప్పులు గొనువారి - నలయింపజూడ,
నప్పులు గొనువార - లందఱమించి,
యప్పులనెగవేయ - నరయు చుండుదురు.

3. కాముకజనుఁడుతా - కాంక్షించినట్టి
కామినివంచింప - గణనలేనట్టి
మాయలువన్నుచు - మరిబొంకుచుండు;
వేయేల? మోసంబు - విశ్వమంతయును.

(అని పాడుచు వెళ్ళుచున్నాఁడు.)

[అంతట కంఠీరవదేవు మరల ప్రవేశించుచున్నాఁడు.]

కం—అతడు మహాబుద్ధిమంతుడు. నాతండ్రి కావడానికి బాగా తగివున్నాడు. నన్ను బాధపెట్టే అప్పులవాళ్ళు యిక్కడ యెవరూ లేరు. ఇక్కడ నాప్రాణం హాయిగావున్నది. నాకాబోయే తండ్రి వచ్చేలోపుగా యేమిచెయ్యావలెనో ఆలోచించుకుంటూ వుంటాను. (అని కన్నులు మూసికొని, ఆలోచించుచున్నాఁడు.)

[అప్పుడు హాజరువారంటు పట్టుకొని భవానిసింగు, శివప్రసాదు, అను భటులు ప్రవేశించుచున్నారు.]

భవా—అడుగో! అతను యిక్కడ వున్నాడు. ఈసారి యితను నన్ను తప్పించుకొని పారిపోలేడు. యీవుచ్చు యితనిచేతులకు వేసి బిగించినామంటే యితను మనకు చిక్కినట్టే.

కం—(తనలో) ఈసారి యీధనంతో ధనమిత్రుని వదుల్చుకో వచ్చును. ఆచిన్నదాని ధనమంతా నాచేతిలోపడితే దాన్ని యెలాగు వుపయోగించుకోవలెనో తెలియకుండావున్నది.

భవా—తెలుస్తుంది. (అని శివప్రసాదుతో మెల్లగా దగ్గరకు వచ్చుచున్నాడు.)

కం—(తనలో) రామామణికీ నాకూవుండేబంధము—

భ—(తనలో) ముందుగా యీబంధముమాట చూచుకో. (అని యుచ్చుచేతికి తగిలించి బిగించుచున్నాడు.)

కం—(ఉలికిపడి కన్నులువిచ్చి) ఇదేమిటి! (అని పెనగు చున్నాడు.)

భ—చేతనయితే యీతాళ్లు తెంపు చూతాము. కిందటి మాటునీవు మాకోర్టు బంట్రోతులనుగుద్ది పారిపోవడంచేత యీసారి మేము సాధనాలన్నీ పట్టుకొని జాగ్రతగా వచ్చినాము. ఇప్పుడు నీవు మమ్మల్ని గుద్దడానికి వల్లలేదు.

కం—(చేతులు లాగుకొనుచు) మోటపశువుల్లారా! కట్లువిప్పండి. విప్పకపోతే—

భ—వూరికే గింజుకోకు. ఈసారి నిన్ను భద్రంగా తీసుకుని వెళుతాములే—శివప్రసాద్! నీవువెళ్ళి వకబండి కుదిర్చితీసుకునిరా. నీవు వచ్చిందాకా నేను యితణ్ని భద్రంగా వుంచుతాను.

శివ—జాగ్రత! (అని వెళ్ళుచున్నాఁడు.)

కం—అయ్యా! మీరెవరు?

భ—భవానిసింగు.

కం—భవానిసింగుగారూ! మీరు కొంచెం కట్టువదులుచేసి వకచెయ్యి విడిచిపెట్టినారంటే బొడ్డుకొంగునవున్న మూటవిప్పి బంగారపు కాసులు మీచేతులోపెడుతాను.

భ—నీఆటలు నాదగ్గిరసాగవు. (బొడ్డుకొంగుతడవి) ఇక్కడ యేమీ మూటలేదు. వట్టిదే.

కం—నీకు జ్ఞానంలేదు. యెవరిబొడ్డుకొంగున అనుకున్నావు?

భ—ధనమిత్రుని బొడ్డుకొంగున మళ్ళీసొమ్ము యేమయినా వుంటే నీకు సమర్పించడానికి నిన్ను భద్రంగా తీసుకొనిరమ్మన్నాడు.

కం—ఆలాగా? ఇప్పుడు వంచకాచార్యు లిక్కడవుంటేనా—

[వంచకాచార్యులు ప్రవేశించుచున్నాఁడు.]

వం—ఇదుగో సమయానికి వచ్చినాను. ఆహాహాహా! ఇదేమిటి కొత్తవినోదంగావున్నది? ఈబంట్రోతేమిటి? చేతులుకట్టడమేమిటి?

కం—కట్టివుండడంచేత నాచేతులు నేను వుపయోగించుకోలేను. నీచేతులు స్వేచ్ఛగావున్నవి. వాటిని బాగా వుపయోగించు— తెలిసిందా?

వం—తెలిసింది. (చేయెత్తి చరవఁబోయినట్టుగా భవానిసింగు మీదికివెళ్ళి) విడిచిపెట్టు.

భవా—యితణ్ని విడిపించినావంటే నీకు యేమిశిక్షఅవుతుందో తెలుసునా?

వం—ఛీఛీ. విడువు.

భ—ఓశివప్రసాద్! ఎక్కడవున్నావో పరుగెత్తుకురిరా.

వం—శివప్రసాదుకాదు నీతాతయెవడువస్తాడో రానియ్యి. వేగిరం యితణ్ని విడిచి దూరంగాపో.

భ—ఇదుగో మెల్లిగావిడిచిపెట్టి వెళుతూవున్నాను. కొంచెం ఓపికపెట్టు. (అని ముడివేసి జరుగుచున్నా(డు.)

వం—వోపికాలేదు గీపికాలేదుపో. (అని భవానిసింగును ఈడ్చి తరిమివేయుచున్నా(డు.) జస్టీజవాను వొళ్ళంతా చెమటలుపట్టేటట్టుగా పరుగెత్తుతూవున్నాడు. మిమ్మల్ని యెలావదిల్చినానో చూచినారా?

కం—నీవు మంచిసమయంలో వుట్టిపడ్డావు. మనం గొప్పగండం తప్పించుకున్నాము. అదుగో! జియ్యరుసూరి యిలాగువస్తూవున్నాడు. వేగిరంకట్లువిప్పు. లేకపోతే నేను పాడయిపోతాను.

వం—ఈముడిరాదు.

కం—అది జారుముడికాదా?

వం—కాదు. గట్టిముడి.

కం—ఏమిబుద్ధి? ఈస్థితిలో ఆయనను నేను యెట్లాచూడను?

వం—నీకు నేను వకవుపాయం చెప్పుతాను. నాబట్టవంటినిండా కప్పుకుని చేతులు పయికి కనబడకుండా నోటితోమాట్లాడు. చేతులతో చెయ్యవలసినపని యేమయినావుంటే నీవెనుకనిలుచుండి నేనుచేస్తాను. పెద్దవాడుగనుక ఆయనకు కళ్ళుతిన్నగా కన(బడవు. (అని తనపయిబట్ట కప్పి తాను వెనుక బట్టలో దూరుచున్నా(డు.)

కం—ఈవుపాయం బాగావున్నది. ఆయనదగ్గిరకు వచ్చినాడు. నన్నానమాలుపట్టలేదు.

[జియ్యరుసూరి ప్రవేశించుచున్నా(డు.]

కం—అయ్యా! నమస్కారము. మీరు యిలాగు దయచేసినారేమి?

జి—ఎవరు? కంఠీరవదేవుగారా? మీరు మీతండ్రిగారిరాక నిమిత్తం యిక్కడ యెదురుచూస్తూవున్నారుకాబోలును. నేను మా తోటలోకి వెళుతూవున్నాను.

కం—ఆయనకోసమే నిరీక్షిస్తూవున్నాను. ఝామునేపటినుంచి కనిపెట్టుకొనివున్నా యింకా ఆయనజాడ కనపడడంలేదు. నిన్నే టెలిగ్రాం పంపినాను.

జి—ఆయన యిప్పుడు రాకపోతే సాయంకాలము వస్తారు. నాకూతురి వివాహం విషయములో యేమీ మోసంలేదుగదా?

కం—ఇందులో మోసంకూడానా!

జి—మీవద్ద పొడుంకాయవున్నదా?

కం—లేదు. తొందరలో తేవడం మరిచిపోయినాను.

జి—నేను రాత్రే చేయించినాను. యీపొడుం యెలాగున్నదో చూడండి. (అని పొడుముకాయ చేతికందిచ్చుచున్నాఁడు.)

కం—ఈరాత్రే చేయించినారా? (వంచకాచార్యులు చంకక్రింది నుండి చేయిచాపి పొడుముకాయ యందుకొని ముక్కుదగ్గర పెట్టుచున్నాఁడు.) దివ్యంగావున్నది. యెక్కడ తెప్పించినారో కాని యిటువంటి పొగాకుమాగోదావరిలంకలోకూడా పండదు. (వంచకాచార్యులు పొడుముకాయను మరల నిచ్చివేయుచున్నాఁడు.)

జి—ప్రొద్దెక్కుతూవున్నది. నేను యిక సెలవుపుచ్చుకొని తోటలోకి వెళ్ళివస్తాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

వం—నామోసం బాగాసాగిందా?

కం—దివ్యంగాసాగింది. నీవు మోసాలరాజువు. నేను మరిచిపోయినాను. నా మొలలో పలుదోముపుల్లలు కోసుకునేకత్తివున్నది. అది పుచ్చుకుని మళ్ళీ వాళ్ళురాకముకుపే—

వం—చెప్పనక్కరలేదు. తెలిసింది. అని కత్తిపుచ్చుకొని కట్లు కోసివేయుచున్నాఁడు.)

కం—ఇప్పుడు నాకు బంధవిమోచనం కలిగింది. మనం వేగిరం వెళ్ళి యీముసలాయనను వలలో పడవేసే ప్రయత్నం చెయ్యవలెను.

వం—వక్కదెబ్బలో చేతాము.

కం—అపాలంలోనుంచి వచ్చేవాళ్ళు యెవరు?

వం—ఇందాకటి బంట్రోతులు.

కం—ఇఖ మాటలకవకాశంలేదు. నాపిక్కబలం చూపవలెను. (అని పరుగెత్తుచున్నాఁడు.)

వం—యెవరికీ దొరక్కుండా పరుగెత్తు. ఓబంట్రోతుల్లారా! వగరుస్తూ పరుగెత్తుకనిరండి. మిమ్ము పట్టుకోవడానికి యిక్కడ యెవరూ లేరు. చేతనయితే నాపరుగుకలుసుకోండి. నేను లేడిలాగు పరుగెత్తుతాను. (అని పాఱిపోవుచున్నాఁడు.)

---

3. రంగము—జియ్యరుసూరి యిల్లు.

[పార్వతియు, దామోదరుఁడును ప్రవేశించుచున్నారు.]

పార్వ—దామోదరా! నేను యెక్కడకువెళితే అక్కడికల్లా తోకలాగు వెంట తిరుగుతూవుంటావేమి? నేను యిందాకాయిచ్చిన రొట్టెముక్కతింటూ వకమూల అణిగి కూర్చోరాదా? వెళ్ళు.

దామో—నీసెలవు ప్రకారం వెళ్ళి మళ్ళీయిప్పుడే వస్తాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

పార్వ—నేను మా అమ్మగారిలాగు గొప్పదాన్ని అయితే బాగావుండును. నాకు భాగ్యం యెత్తుకోవడానికి వెనుక యెరకలదిరెండు

డబ్బులుయిస్తే వేరుముక్క కడుతానన్నది. అదుగో అమ్మగారు వస్తూవున్నారు.

[రామామణి ప్రవేశించుచున్నది.]

రామా—పార్వతీ! ఈ వుదయాన్న వెళ్ళినతరువాత కంఠీరవదేవుగారు నాకు యేమయినా వుత్తరం పంపించినారా?

పార్వ—లేదు. నావద్దకు పంపలేదు.

రామా—దామోదరా?

[దామోదరుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దామో—అమ్మా! వస్తూవున్నాను.

రామా—నీవు యీవుత్తరం తీసుకునివెళ్ళి పూటకూళ్ళయింటికాడ యిచ్చివస్తావా?

పార్వ—దామోదరా! కదలవేమి?

దామో—నాపని కుక్కలాగు యిక్కడికీ అక్కడికీ తిరగడంతోసరిపోతూవున్నది. (అని వెళ్ళుచున్నాఁడు.)

రామా—పార్వతీ! నేను మావాళ్ళయింటికి వెళ్ళినకాలంలో కంఠీరవదేవుగారు ఇక్కడికి రాలేదని నీకునిశ్చయంగా తెలుసునా?

పార్వ—రాలేదు. యెంతమాత్రమూ రాలేదు.

రామా—అతడు యిప్పుడు యేమివుపాయం ఆలోచిస్తూవుండివుంటాడు? ఆతనికి నామీద ప్రేమవున్నందుకు లేశమూ సందేహంలేదు. కాని అతని వుపాయాలు సాగుతవో లేదో అనిమాత్రం నాకు సందేహంగా వున్నది. రాజమహేంద్రవరంలో అతనికి తండ్రివున్నట్టు నేను యెప్పుడూ వినివుండలేదు.

పార్వ—(ముందువంకచూచి) అదుగో ఆయన వస్తూవున్నారు.

[కంఠీరవదేవు ప్రవేశించుచున్నాడు.]

కంఠీ—ప్రియురాలా! రామామణీ! నిన్ను చూడడంచేత నా ప్రాణాలు లేచివచ్చినవి.

పార్వ—బహుదొడ్డవాడు. ఈయన దేవుడులాగు మాట్లాడుతున్నాడు.

రామా—మీరు యింతదూరం నాకోసం నడిచివచ్చినారా? యేమయినా యెక్కి రాలేదా?

పార్వ—ఆయన యెండెక్కివచ్చినారు.

రామా—పార్వతీ! యీపాటి నీవువెళ్ళిపో.

పార్వ—వెళుతూవున్నాను. (తనలో) వీరుయిద్దరూ కలుసుకోవడంతోటే యేదో రహస్యంవున్నట్టు నన్నవతలకి పంపివేస్తారు. నేను అవతలికివెళ్ళి వీరుయేమిచేస్తూవుంటారో యీతలుపుసందునుంచి చూస్తూవుంటాను. (అని వెళ్ళుచున్నది.)

కంఠీ—ఓ ప్రాణేశ్వరీ! వ్యవహారమంతా కుదిరింది. రేపు తెల్లవారేలోగా మీతండ్రిగారి అనుమతితోనే నిన్ను నా సొమ్మునుగా చేసుకుంటాను.

రామా—కంఠీరవా? నీదగ్గిరవున్న తప్పితమల్లా తలకుమించిన పెద్దయెత్తులుయెత్తడ మనుకుంటాను.

[పార్వతి ప్రవేశించుచున్నది.]

పార్వ—అమ్మా బాబయ్యగారి సెలవయింది. మిమ్మలిని ఆయన పొస్తకాలగదిలోకి తీసుకుని రమ్మన్నారు.

రామా—కంఠీరవా! నేను యిక్కడ వుండనల్లకాదు. వెళ్ళిపోతాను. నీవు చేసే ప్రయత్నం సఫలంకావడం నాకుయిష్టమేకాని నీ

గౌరవానికిగాని నా యోగ్యతకుగాని భంగంవచ్చే పనిమాత్రం నీవు యెంతమాత్రమూ చెయ్యకూడదుసుమా. (అని వెళ్ళుచున్నది.)

పార్వ—(తనలో) వీళ్ళునన్ను అవతలికి పంపించడానికి యెప్పుడూ మఱిచిపోరు. అయినాకానీ! వీళ్ళు చాలాసేపు మాట్లాడుకోవడానికి అవకాశంలేకుండా వెంటనే వచ్చి పంపివేసినాను. నేను పోవలెను.

(అని వెళ్ళుచున్నది.)

కంఠీ—నాప్రియురాలి మాటలతో నాధైర్యమంతా చెడిపోయింది. జియ్యరుసూరిగారివద్దకు వెళ్ళి, ఆయనకాళ్ళమీదపడి, చేసిందంతా వప్పుకుంటాను. (అని వెళ్ళఁబోవుచున్నాఁడు.)

[అంతట తెల్లగడ్డముతోను మీసములతోను ముసలి వేషము వేసికొని చేత కఱ్ఱపట్టుకొని వంచకాచార్యులు ప్రవేశించుచున్నాఁడు.]

కంఠీ—నీవుయెవరు? ముందుగా వర్తమానం చెయ్యకుండా పెద్దమనుష్యుల యింట్లో యిలా ప్రవేశించినావేమి?

వంచ—నేనుయెవరినా? నన్ను నీవు ఆనవాలు పట్టనేలేదా? కన్న తండ్రిని తెలుసుకునేవాడు యోతటివాడు కావలెను? నీవు చేసుకున్న తండ్రినే నీవుగుర్తుపట్టలేకుండా వున్నావు.

కంఠీ—ఆహాహాహా! ఏమీ! వంచకాచార్యులా?

వంచ—అవును. కఱ్ఱా గడ్డమూ మీసాలూ అన్నిటితోనూ వచ్చినాను.

కంఠీ—నీవువేసిన వేషంలో కథబాగా వినిపించగలవా?

వంచ—మీచిత్తంవచ్చినట్లు వినిపిస్తాను. నేను యేమోస్తరు ముసలికథ వినిపించవలెను? "నేను వీధులలో ఆడుకునేదినాలలో అరవై యేళ్ళకిందట" అని పాతకథలుచెప్పే ముసలివేషం కావలెనా? 'ఆహాహా

ఇహీహీ! శబాసు! మహామంచికథ. ఆహాహా! ఇది తలుచుకుంటే నాకు చిన్నప్పటికథ జ్ఞాపకంవస్తూ వున్నది. ఇహిహిహీ!' అని మాటమాటకూ నవ్వుతూవుండే ముసలివేషం కావలెనా? 'ఇప్పటివాళ్ళనుచూస్తే నాకు తలకాయనొప్పి వాళ్ళమాటతలపెట్టకు. కాలమంతా చెడిపోతూవున్నది. పాడుకాలం వచ్చింది. యెవరితోనైనా మాట్లాడితే నాకు చిరాకు' అని చిరాకుపడుతూ నిష్కారణంగా కొరకొరలాడుతూవుండే ముసలివేషం కావలెనా? ఈ మూడింట్లో యేదికావలెను?

కంఠీ—సమయంకనిపెట్టి నీయిష్టంవచ్చినట్టు చెయ్యి. ఆముసలాయన మనసుకనిపెట్టి యెప్పటికెలాగు మాట్లాడవలెనో అలాగు మాట్లాడు. నేనుచెప్పినసంగతిమాత్రం మరిచిపోకు.

వం—చూడు. ఆయనను నావలలో యెలాపడవేస్తానో?

కంఠీ—అలాగయితే కార్యం యెంతశీఘ్రంగా నెరవేరితే అంత మంచిది. ఆయన పొస్తకాలంటే చెవికోసుకుంటాడు. ఆయన యిప్పుడు పొస్తకాలగదిలో వున్నాడు.

వంచ—ఇఖ ఆయనవద్దు మనపుస్తకంలో యెక్కించుకోవచ్చును.

కంఠీ—ఆలస్యంచెయ్యక నెంటనేవెళ్ళు.

వం—నామనస్సులో నేను వలఅంతాపన్నినాను. ఆముసలిగొడ్డు నావలలో పడుతుంది. వెళుదాముదండి. (అని ఇద్దఱును వెళ్ళుచున్నారు.)

౮. రంగము—జియ్యారుసూరి పుస్తకములగది.

[జియ్యారుసూరి ప్రవేశించుచున్నాఁడు.]

జియ్యా—కంఠీరవదేవు తనతండ్రిని యింకాపంపించినాడుకాడు. అతనికి వకవేళ తండ్రిలేనేలేడేమో! అమ్మాయికి యిష్టంవుంటే అతణ్ని పెళ్ళిచేసుకోవచ్చును.

పార్వ—(వెలుపలనుండి) అయ్యా! నేను లోపలికి రావచ్చునా?

జియ్య—పార్వతా? రావచ్చును. రా.

[పార్వతి ప్రవేశించుచున్నది.]

పార్వ—అయ్యా! ఆయనవచ్చినాడు.

జియ్య—ఆయన యెవరు?

పార్వ—కంఠీరవదేవుగారి తండ్రిగారండి. ఆయన మహాతమాషాగా వున్నారు. మిట్టపళ్ళూ జనపనారపీచువలె గడ్డమూ ముసలిపండులాగువున్నారు. ఆయన చేతులో పెద్దకర్రవున్నది.

జియ్య—ఆయనను లోపలికి తీసుకొనిరా. (అనిలేచుచున్నాడు)

పార్వ—కర్రనూ ఆయననూకూడానా?

జియ్య—అందరినీని.

పార్వ—ఆయన గుమ్మమువద్దనే వున్నారు. (అని వెళ్ళుచున్నది.)

[వంచకాచార్యులతో పార్వతి మరల ప్రవేశించుచున్నది.]

పార్వ—అయ్యా! యిదిమార్గము. అరుగో ఆనిలుచున్నవారే జియ్యరుసూరిగారు. (అని వెళ్ళుచున్నది.)

వంచకాచార్యుడు—(ఆయనవీపుతట్టి) బావగారు క్షేమంగా వున్నారా?

జియ్య—మీరు ముసలివారయినా చాలా బలంగావున్నారు. పార్వతీ! ఈయనకు కుర్చీవెయ్యి. కూర్చుండండి.

వంచ—(కూరుచుండి) సంగతంతా విని సంతోషించినాను.

జియ్య—మీకుమారిడి వుత్తరం అందినవెంటనే బయలుదేరి వచ్చినారు కాబోలును.

వం—వుత్తరంలేకుండానే వచ్చినాను. మాకంతీరవుణ్ని నేను యీవూరువచ్చినతరువాతనే చూచినాను.

జియ్యా—మీరు అలసివచ్చినారు. కొంచెం పాలు దాహం పుచ్చుకుంటారా?

వంచ—సిద్ధంగావుంటే కొంచెం ఫలహారంకూడా చేస్తాను.

జియ్యా—పార్వతీ! వెండిగిన్నెతో పాలూఫలహారీలు ఇలాతీసుకునిరా.

వం—మీరు బహుమర్యాదస్థులు. (అని త్రాగుచున్నాడు.)

జియ్యా—కాలం వ్యర్థంగా పోగొట్టడం యెందుకు? ఫలహారంతోపాటు మనవ్యవహారంకూడా చక్కపెట్టుకుందామా? మాతో సంబంధం చేసుకోవడం మీకు యిష్టంగా వున్నదా?

వం—పరమానందంగా వున్నది.

జియ్యా—మీభూములన్నీ గోదావరితీరమందు వున్నవని విన్నాను.

వంచ—నిజంగానా?

జియ్యా—నిజంగా నే. మీభూములకు పన్ను లేదుగదా?

వంచ—నేను సర్కారుకు చిల్లిగవ్వ పన్ను యివ్వవలసిన పనిలేదు.

జియ్యా—(లేచి) మీసంభాషణవల్ల నాకుతృప్తికలిగింది. కావలసింది పార్వతినడిగి తెప్పించుకొని యిఖమీరు సావకాశంగా ఫలహారం చేస్తూవుండండి. ఈ సమీపంలోనే మాకు బంధువుడున్ను స్నేహితుడున్ను వకాయనవున్నాడు. ఆయనతో యీసంగతి ఆలోచించి కార్యనిశ్చయం చేసుకొనివస్తాను.

వంచ—వెళ్ళిరండి.

జియ్యా—మళ్ళీ యిక్కడవున్నట్టేవస్తాను. (అని వెళ్ళుచున్నాడు.

వంచ—ఆయన వెళ్ళినాడు. ఇక్కడ నావేషం బాగాపారింది. ఇక కంఠీరవదేవు రామామణిని వివాహంచేసుకుంటాడు. నేనుపడ్డ శ్రమకు నాకుకూడా కొంతలాభం కలుగుతుంది. తెలివితక్కువవాళ్ళు సత్యమే జయమంటారుగాని నిజానికి అసత్యమే జయం. నేనుచేసే మోసాలూ అబద్ధాలూ యెలా సాగుతూవున్నవో!

[పార్వతి ప్రవేశించుచున్నది.]

పార్వ—అయ్యా! యేమిటి సెలవిస్తూవున్నారు?

వంచ—ఓసిభూతమా! నేను యెవరితోనూ అననిమాటలు నీవు పొంచుండి యెందుకు వింటూవున్నావు?

పార్వ—యెన్ని తెచ్చినా చాలకుండా భూతంలాగు అన్నీ నీవే దిగమింగివేస్తూవున్నావు. భూతాన్ని నీవా? నేనా?

వంచ—పోనీ పూరుకో. నీవు యీసంగతి యెవరితోనూ చెప్పకు. నీకు తరువాత నేను యేమయినా యిస్తాను. మీయజమానుడు యింట్లోలేడు. ముందుగా యీపూరీలు నాలుగుతిను. (అని యిచ్చుచున్నాఁడు.)

పార్వ—(పుచ్చుకొని తినుచు) మీకు మేలుకలుగవలెను. మీరు మా అమ్మబ్రతికినంతకాలం బ్రతకండి.

వంచ—చెప్పులచప్పుడవుతూవున్నది. యెవరో వస్తూవున్నట్టున్నారు.

[జియ్యరుసూరియు, కంఠీరవదేవును, రామామణియు, దామోదరుఁడును, ప్రవేశించుచున్నారు.]

జియ్య—కంఠీరవా! నీవుచేసిన మోసం నీ అంతట నీవే ధారాళంగా చెప్పివేసి క్షమార్పణ కోరడంచేత నీవుచేసినతప్పును నేను క్షమించినాను.

కంఠీ—అయ్యా! వక్కమనవి—

జియ్యా—నీవేమీ చెప్పనక్కరలేదు. మాచిన్నదానికి నీడబ్బక్కరలేదు. నీవు గుణవంతుఁడవైతే—

వంచ—(వెలుపలినుండి) నేనుకాను నేనుకాను. అదిమరివకరు వదిలిపించినవాడికి శిక్షలేదు. నాయజమానుడు వాఁరిలోవున్నాఁడు. పట్టుకోండి.

[పార్వతి వెనుకరాఁగా భవానిసింగుచేతను శివప్రసాదుచేతను పట్టుకోఁబడి వంచకాచార్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కంఠీ—ఏమీ! వంచకాచార్యులా?

వంచ—ఏమి వంచకాచార్యులు? చివరకు వంచకాచార్యులే వంచితుడయినాడు. నేను లోపల ఫలహారప్రయత్నంలో వుండేటప్పటికి వీళ్లు వెలుపలనన్ను పట్టుకోవడపు ప్రయత్నంలోవుండి అధాత్తుగా మీదపడ్డారు.

భవా—ఇప్పుడు పట్టుపడ్డది నీవువక్కడవేకాదు. నీయజమానుడుకూడా పట్టుపడ్డాడు. ఇఖ తప్పించుకుపోవడానికి వల్లకాదు. వెలుపల పోలీసువారిని కావిలిపెట్టి వచ్చినాము.

జియ్యా—మాయింట్లోవుండగా యెవరికీ కష్టంకలుగరాదు. వీరు యెంతసొమ్ము యివ్వవలెనో నేను యిచ్చివేస్తాను. వీరిని వదలిపెట్టండి.

భవా—ఇతణ్ని వారంటుమీఁద పట్టుకున్నమనిషిని విడిపించినందుకు పట్టుకున్నాము. ఇతణ్ని విడిచిపెట్టవల్లకాదు.

జియ్యా—వెండిరూపమయిన యీనుందు మీచేతికి తగిలితే యితణ్ని పట్టుకోవడానికి మీకే చేతులురావు. ఇవి పుచ్చుకొని వెళ్ళిపోండి. (అని పదిరూకలు చేతులో పెట్టుచున్నాఁడు.)

భవా—ఈమందుతో నాచేతులు కట్టివేసినారు. మీా అవుషధం శివప్రసాదుచేతికికూడా తగిలి స్తేనేకాని ఆతని చేతులు కట్టుపడవు.

శివ—నాచేతులా?

జియ్య—మాట్లాడకు. నీచెయ్యి యిలాగుపట్టు. (అని యతని చేతిలో మరి పదిరూపాయలు పెట్టుచున్నాఁడు.)

శివ—మేము యెప్పుడూ డబ్బుకు లోబడేవాళ్ళంకాము. లక్ష వరహాలుకుప్పపోసినా మేము వక్క అక్రమకార్యం చెయ్యము. మీా వంటి పెద్దలమాట మీారరాదు గనుక వీరిని విడిచిపెడుతూవున్నాము. బాకీసొమ్ము దయచేయించండి.

జియ్య—దామోదరా! వీరిని తీసుకునివెళ్ళి లోపల సొమ్మిప్పించి పంపివేసిరా.

దామో—చిత్తము. (ముగ్గురును వెళ్ళుచున్నారు.)

జియ్య—వంచకా! నీకు రాజమహేంద్రవరంలో తోటవున్న దని బొంకి నన్ను మోసం చెయ్యతలచుకొన్నావుకావా?

వంచ—నాకక్కడ తోటలేదా? నిజంగానేవున్నది. నేను చెప్పిన దానిలో యేమిా మోసంలేదు. ఆవూళ్ళో మ్యూజియంతోట మాదే.

జియ్య—చందాలువేసి కట్టింది అది అందరిహక్కున్ను. నీది యెలాగయింది?

వంచ—నేనూ అందరిలో వాణ్నే గనుక అందరితోటిపాటు నాదీ అయింది.

జియ్య—ఆహాహా! నీయుక్తికి సంతోషించినాను.

వంచ—మీారొక్కరేయేమిటి? నాయుక్తికి అందరూ సంతోషించేవారు. చిన్నతనంలోనే నాతమ్ముడయిన దామోదరుణ్ని—

[దామోదరుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దామో—దామోదరుణ్నా? యెవరు నాపేరెత్తుతూవున్నారు?

వంచ—దామోదరుణ్ని మోసంచేసి వాడిచేతులోవుండే పళ్ళూ పంచదారా తింటూవుంటే నాశక్తికి నన్ను మాతల్లికూడా మెచ్చుకునేది.

దామో—గొప్పవాడుకావలెనని చిన్నతనంలోనే దేశాలు తెగించిపోయిన జనార్దనుడవా నీవు? మాజనార్దనుడు చిన్నతనంలో నాచేతిలోయేమివున్నా యిట్టే మాయంచేసి యెత్తుకొనిపోయేవాడు.

వంచ—ఆజనార్దనుణ్నే నేను. యిల్లువిడిచి వెళ్ళినతరువాత నాశక్తిసామర్థ్యాలచేత నేను వంచకాచార్యులనయినాను. దామోదరా! యిలావచ్చి నన్ను కాగిలించుకో. ఇప్పుడు నేను కొడుకును పోగొట్టుకున్నా తమ్ముణ్ని సంపాదించుకొన్నాను. (అని కౌఁగిలించుకొనుచున్నాఁడు.)

దామో—అన్నయ్యా! అప్పుడే యింతముసలివాడనైపోయినావేమి?

వంచ—నేను ముసలివాణ్ని కావడం నీకు యిష్టంలేకపోతే యిదుగో మళ్ళీ పడుచువాణ్నవుతాను చూడు. (అని క్రొత్తగా పెట్టుకొన్న పండ్లను మీసములను గడ్డమును తీసివేయుచున్నాఁడు.)

పార్వ—దామోదరా! నీవు నన్ను పెళ్ళాడుతావా?

దామో—నేను అన్నమాటతప్పను. తప్పకుండా నిన్ను పెళ్ళిచేసుకుంటాను.

కంఠీ—సీతమ్మణ్ని చూచి మనమంతా మంచిమార్గం నేర్చుకోవలెను. వంచకా! నీవు యింతటినుంచి అబద్ధాలూ మోసాలూ మానివేసి పెద్దమనిషివికా. నేనూ అవుతాను.

వంచ—నేను రూపంచేత యిప్పుడే పెద్దమనిషినయినాను. ఇఖ నడతచేతకూడా అవుతాను. ఇప్పుడే నిశ్చయంచేసుకున్నాను.

జయ్యా—కంఠీరవా? ఇప్పుడు పశ్చాత్తాపంకలిగి నిజంగానే నీనడత తిన్నచేసుకు నేటట్టయితే నాకూతురిని నీకు తప్పకుండా యిచ్చి నిన్ను యిల్లరికంవుంచుకుంటాను.

కంఠీ—మామా! ముందు నానడత మీరు జాగ్రతగా పరీక్ష చేసి చూడండి. నాకు యింతటితో బుద్ధివచ్చింది. మోసాలూ అబద్ధాలూ కొంతకాలం లాభకరంగావున్నా కడపట సత్యమే జయి స్తుంది. ఓమహాజనులాగా! నామాట నమ్మండి. అల్పలాభంనిమిత్త మయి అబద్ధాలూ మోసాలూ మానండి. లోపలికి వెళుదాముఠండి.

(అని అందఱును వెళ్ళుచున్నారు.)

—

మోడరన్ ప్రెస్, కలర్ ప్రింటర్స్ & బాక్సు మేకర్స్, రాజమండ్రి.

అసహాయశూర ప్రహసనము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

మూడవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,

రాజమహేంద్రవరము

1950

 [వెల రు 0-5-0

అసహాయశూరప్రహసనము

— ఇందువచ్చు పాత్రములు —

భావరాజు భీమరాజు—మహాశూరుఁడు

పెంటయ్య—మహావీరుఁడు

వీరభద్రుఁడు—సరస్వతి ప్రియుఁడు

భ్రమరాంబ—భీమరాజుభార్య

సరస్వతి—భీమరాజుకూఁతురు; వీరభద్రుని ప్రియురాలు

---

౧ రంగము—భీమరాజుగారి ముందరలోగిలి.

[భ్రమరాంబయు సరస్వతియు ప్రవేశించుచున్నారు]

సర—(విచారముతో) అమ్మా! ఆయన యెలాగు వున్నారు?

భ్రమ—అమ్మాయీ! యెలాగువున్నారని చెప్పను. రాత్రి ప్రొద్దుపోయి యింటికి వచ్చినప్పటినుంచీ ఆయనచర్య నాకుమహావింతగా వున్నది. నాకు యేమని చెప్పడానికీ తోచదు. యేమాట అడిగినా దేనికీ జవాబు చెప్పరు. వూరికే పరధ్యాన్నంగా వుంటారు. రాత్రి యెవరియింట్లోనైనా కన్నం వేసినారో, యెవరినైనా తలకాయ బద్దలు కొట్టినారో, యేదో అటువంటి గొప్పకార్యం చేసివుంటారు.

సర—మానాన్నగారిమీద నీవునిష్కారణంగా లేనిదోషాలు ఆరోపిస్తూవున్నావు.

భ్రమ—నిష్కారణంగానా? మొట్టమొదట రాత్రి పంటిగంట దాకా ఆయన యింటికేరాలేదు. వచ్చిన తరువాత రాత్రి తెల్లవారిం దాకా నిద్రపట్టక మంచంమీద ఇటూఅటూ దొర్లుతూతనలోతా నేమో అర్థంలేనిమాటలు గొణుక్కుంటూ పలవరిస్తూనే వున్నారు. రెండోఅంశము తెల్లవారిన తరువాత మూలగదిలో ముసుకు వేసుకుని కూర్చుండి కచేరీవేళఅయిందని భోజనానికి యెన్నిమాట్లు పిలిచినా లేచి రాకుండా వున్నారు. ఇదివరకు యెప్పుడయినా యింత ప్రొద్దెక్కిం దాకా కచేరీకివెళ్ళకుండా యింట్లో అట్టేవున్నారేమో చెప్పు. యేదీ లేకపోతే యెందుకు అట్టేవుంటారు? ఆయనకు యిష్టమయినకూర అని నేను యెంతో ఆసక్తితో ముప్పేంకాయ చేసి పిలిచినా రాలేదు. ఇంతకూ యిదంతా నాదురదృష్టం.

సర—నీవు తొందరపడపోకు. ఆయనమనస్సు స్వస్థంగాలేక పోవడానికి అనేక కారణాలు వుంటవి. ఈమధ్య మనయింటికి చుట్టాలు రావడం యెక్కువఅవడంచేతనే కాదా నేనుకూడా లోపలిభవంతిలోనే సర్దుకుని యిదివరదాకా నేను పడుకునే తోటలోవున్న యీముందర భవంతి కాలీచేసి అద్దెకు యివ్వడానికి సిద్ధం చేసినాను.

భ్రమ—నీవు యేవిధంగా సర్దిచెప్పినా నామనస్సుకు సమాధానం కలుగదు. నేను వట్టి అదృష్టహీనురాలిని. అమ్మాయీ! నీకు వక్కసంగతి చెప్పుతానువిను. నీవుమాత్రం యెప్పటికీ నీదేహాన్ని స్వేచ్ఛనూ యితరులకు అమ్ముకోకు.

సర—స్వేచ్ఛను అమ్ముకోవడం అంటే నాకు యేమీ అర్థం కావడంలేదు. ఆ మాటలకు వివాహం అని నీ అభిప్రాయం అయివున్నట్టయితే నాన్నగారు వప్పుకుంటే వీరభద్రరాజును నేను తప్పకుండా పెళ్లిచేసుకుంటాను. అతనికి కచేరీలో పనికావడంతోటే మా వివాహానికి నాన్నగారు వప్పుకుంటామన్నారు.

భ్రమ—అమ్మాయీ! యీవిషయంలో నీకు లోకానుభవం బొత్తిగాలేదు. ముందుగా తొందరపడి యేదైనా కార్యంచేస్తే తరువాత విచారించవలసివస్తుంది. నేను ముసలివాణ్ని చేసుకుంటే సుఖపడుతానని నీ తండ్రిని రెండో పెళ్లివాణ్ని వివాహం చేసుకున్నాను. చేసుకున్నందుకు నేను యిప్పుడు యెలాగు విచారిస్తూవున్నానో చూస్తూవున్నావా? వీరభద్రరాజు వచ్చినాడా అని యీవుదయాన్నుంచీ మీ తండ్రిగారు నన్ను చాలామాట్లు అడిగినారు.

నర—నిజంగా అడిగినారా? యిదివరదాకా ఆయన వీరభద్రరాజుకు కచేరీలోపని అయ్యేవరకూ ఆపేరే తనవద్ద తలపెట్టవద్దన్నారు. నాకు వేగిరం వివాహంచెయ్యవలెననే ఆసక్తిచేత యిప్పుడు ఆయన మనస్సు మార్చుకున్నట్టున్నారు. అయ్యో! యిప్పుడు వీరభద్రరాజు వస్తే బాగావుండును. ఇది కచేరీవేళగనుక నాన్నగారు యింట్లోవుండరనుకుంటాడేమో! అతనికి యెవరిచేతనైనా వర్తమానం పంపింతునా? నాన్నగారువుండగానే వస్తే సంబంధనిశ్చయం యిప్పుడే అవుతుంది.

భ్రమ—వూరుకో. మీనాన్నగారు వస్తూవున్నారు. మన యిప్పటిప్రసంగం ఆయనముందర యేమయినా అనేవుసుమా! జాగ్రత.

[వీధివంక తొంగిచూచుచు భీమరాజుగారు ప్రవేశించుచున్నారు.]

భీమ—యెవరూవస్తూవున్నట్టులేదు. యేమివచ్చినాసరే నేను యిప్పుడు వక్కమాటు కచేరీకివెళ్ళి ముఖంచూపించి రాకతప్పదు. యివేళ కచేరీకి యింతఆలస్యంగా వెళ్ళినందుకు యేదయినా కారణం కల్పించుకునిపోవలెను. నిన్నటిరాత్రి వ్యవహారం యెలాముగిస్తుందో నాకు తెలియకుండావున్నది. (భార్యను కోపముగానైనచూచి) మీరు యిక్కడ యేమిచేస్తూవున్నారు? మీకు యేమికావలెను? అలా చూస్తారేమి?

భ్రమ—మీ యీనడత నాకుయేమీ బోధపడకుండావున్నది.

సర—నాన్నగారూ! యీ వుదయాన్నుంచీ మీ చూపులు యెలాగోవున్నవి.

భీమ—(తనలో) నాముఖంచూచి వీళ్ళు యెలాగో నాసంగతి కనిపెట్టినారు. (బిగ్గరగా) ముఖంకేసి చూడడమూ పిచ్చివూహాలు చెయ్యడమూతప్ప మీకు యింట్లో వేరేయేమీ పనిలేదా? పొండి. ఇఖ నాతోమాఱుమాట ఆడకండి. అమ్మాయీ! నేను కచ్చేరీకి వెళ్ళడానికి నాతలపాగా అంగరఖా యిలాతీసుకునిరా. పోరేమి?

సర—వెళుతూవున్నాము. (నడుచుచు) పిన్నీ! ఇదేమిటి?

భ్రమ—యేమనిచెప్పను? లోకంలో మొగవాళ్ళంతా యిదే మోస్తరు. యింతప్రొద్దెక్కి యిప్పుడు భోజనంచెయ్యకుండా కచేరీకి వెళుతారట. (అని యిద్దఱును వెళ్ళుచున్నారు.)

భీమ—(అంతట కలయఁజూచి) అందరూ వెళ్ళినారా? వెళ్ళినారు. నేడు యెటువంటి పాపిష్టిరాత్రి గడిపినాను? అది రాత్రికాదు. నాపాలిటికి వక మహాయుగంలాగు కనపడ్డది. నేను యెప్పుడూ నాటకాలు చూడడానికి వెళ్ళేవాణ్నేకాను. భోంచేసి శిరస్తాదారుగారి యింటికి వెళ్ళివస్తూ దోవలో నాటకం ఆడుతూవున్నారంటే యిట్టే లోపలికిపోయినాను. అప్పుడు నారొండిని అర్ధరూపాయి వుండడంచేత దానితో రెండవతరగతి టిక్కెట్టుకొని బల్లమీద కూర్చున్నాను. నేను కూర్చోవడంతోటే వెనుకనుంచి యెవళ్ళో అల్లరివాళ్ళు పాగాఅడ్డం తీసివెయ్యమని కేకలువేస్తే నాతలపాగాతీసి నేనుకూర్చున్న బల్లమీద పక్కగా పెట్టినాను. నాటకం అయిపోయే ముందర నాతలపాగాకోసం చూచుకునేటప్పటికి కనపడ్డదికాదు. దగ్గరవున్నవాళ్ళను యెవరిని అడిగినా లేదన్నారు. అందుమీద నాబల్లమీద వున్నవారినందరినీ

లెమ్మనేటప్పటికి నాపాగా వక పెద్దమనిషి ముడ్డికింద నలిగివున్నది. 'ఏమయ్యా! నాపాగా మెత్తగా వేసుకుని కూర్చోవడం మీకుధర్మమేనా?' అని నేనా పెద్దమనిషిని మందలించేటప్పటికి తాగివుండడంచేత నన్ను అతడుతిట్టి అడ్డమయిన కారుకూతలూ కూసినాడు. నేను శాంతంవహించి వూరుకు నేవుందునుగాని దగ్గిరవున్న వాళ్లందరూ ప్రోత్సాహంపరిచి పురిమెక్కించడంచేత రోషంవచ్చి నేనుకూడా తిట్టి అతణ్ని మెడపట్టుకుని గెంటినాను. అతడు కిందపడిలేచి 'యిది నాటకంపాక అయిందిగనుక బ్రతికిపోయినావు. నీపేరూ యిల్లూ చెప్పు. రేపు యేమిచేస్తానో చూడు' అన్నాడు. నేను 'భావరాజు' అని యింతలోనే అతనిమీద జాలిపుట్టడంచేతనో మరియెందుచేతనోకాని కోపమంతా మింగినేసి 'మంగళవారపుపేట' అని చెప్పినాను. అతను వెంటనే తన జేబులోనుంచి వక కాకితముతీసి దానిమీద తనపేరు 'పెంటయ్య. లక్ష్మివారపుపేట సత్రము' అని వ్రాసి నాచేతికిచ్చి రేపు దెబ్బలాడుదాము రమ్మన్నాడు. నేను యింటిపేరుచెప్పి పేరు చెప్పకపోవడంచేతనూ, పేట తప్పుపేట చెప్పడంచేతనూ యీ బుధవారపుపేటలో నన్ను అతను కనుక్కోలేడు. పెంటయ్య అనేపేరు నిజమయినదిగా నమ్మడానికి వీలులేదు. అతనిముఖంచూస్తే అతడు ఖూనీలుచేసి తెంపరిగా కనపడ్డాడు. అతడు యెక్కడ కనపడుతాడో అని నేను యివేళ వీధిలోకి వెళ్ళలేదు. నేను వీరభద్రరాజుతో మాట్లాడవలెను. అతను తనకు నాయందు గురుభక్తి అనిన్నీ సమయంవస్తే నానిమిత్తం ప్రాణాలయినా విడుస్తాననీ చెప్పుతూవుంటాడు. ఇప్పుడు సమయంతటస్థించింది. గనుక నాతరపున వాడితో పోట్లాడడానికి వెనుకతియ్యడని తలుస్తాను. అతను దిట్టంగా వున్నాడు. ఇటువంటి యిద్దరు పెంటయ్యలను కొట్టగలడు.

[అంగరకాయును, తలగుడ్డయును పట్టుకుని సరస్వతియు, భ్రమ రాంబయు ప్రవేశించుచున్నారు.]

సర—నాన్నగారూ! ఇవిగో.

భీమ—(అంగరకా తొడుగుకొనుచు) దోవలో అతనునాకు యెదురుపడుతాడేమో! (మొగము కనపడకుండ తలపాగాముందుకు పెట్టుకొని) ముందుగానే జాగ్రత పడడం మంచిది — అమ్మాయీ! లోపలికివెళ్ళి బనాచుపచ్చడం తీసుకునిరా.

సర—ముండు వేసవికాలంలో బనాచుపచ్చడం యెందుకు!

భీమ—యెందుకైతేనేమి? నామాటకు అడ్డంచెప్పక తీసుకునిరా.

భ్రమ—అమ్మాయీ! వెళ్ళితీసుకునిరా. ఆయననిన్ను వదుల్చుకోవలెనని పని కల్పన చేస్తూవున్నారు.

భీమ—వదుల్చుకోవలెనా? నేనేవదులుతాను. ఇఖముంచు నీవునక్కదానవూ సుఖపడుదువుగానిలే. కాపురానికి వచ్చిన నాలుగు సంవత్సరాలలోనే అప్పుడే నేనంటే నీకింత విసుకుదలగావున్నదా? నీ కోరికేలభిస్తుంది. పోని నీతోనేను యిప్పుడు తగవులాడను.

సర—(పచ్చడముతో ప్రవేశించి) ఇదుగో తెచ్చినాను.

భీమ—(పుచ్చుకొని మొగమునిండ ముసుగువేసికొని) అమ్మాయీ! వెళ్ళివస్తాను. నాతప్పులు క్షమించండి. (తనలో) ఏదయినా అపాయంవస్తే యిదే ఆఖరుసెలవు. (అని వెళ్ళుచున్నాడు.)

భ్రమ—ఆయనమాటలు విన్నావా? అందులో చాలా అర్థం వున్నది. నేను వక్కదాన్నీ సుఖపడడమట! ఈవక్కమాటలోనూ యెంతఅర్థమయినా వున్నది.

సర—నాకు యేమీా కొత్తఅర్థం కనపడడంలేదు.

భ్రమ—నీకు కనపడడంలేదు. పెళ్ళిచేసుకుని నాలుగేళ్ళపాటు మొగుడితోవుంటేనేకాని యిటువంటివి యేవీకనపడవు. నాకు పని వున్నది లోపలికివెళుతాను. యెవ్వరైనా అద్దెకు అడిగితే తోటబంగళా నాలుగురూపాయలకు యిచ్చివెయ్యి. నీపెళ్ళివిషయంలో నేను యిందాకా చెప్పింది మరచిపోకుమా. మగవాళ్ళంతా వక్కటేఅచ్చు. వక్కరినీ నమ్మరాదు. యెవరినైనా మగవాణ్ని పెళ్ళిచేసుకోవడానికి ముందుగా బాగా ఆలోచించుకో. (అని వెళ్ళుచున్నది.)

[వీరభద్రరాజు ప్రవేశించి సరస్వతికి కనబడకుండ వెనుక నిలుచున్నాడు.]

సర—ఆలోచించుకోనా? ఇదివరకే బాగా ఆలోచించుకున్నాను. వీరభద్రరాజు తనమీద మక్కువవున్నదా అని అడిగితే మాట్లాడక వూరుకున్నాను. నామనస్సులోవున్న కోరిక చెప్పేటట్టయితే మక్కువ వున్నదని వెంటనే చెప్పవలసిందే. అయితే నాకు అతనిమీద మోహంవున్నసంగతి కొంతకాలందాకా తెలియకుండా వుంచుతాను.

వీర—ఏమీ!

సర—ఎవరువారు? మీరేనా? తనలోతాను రహస్యంగా మాట్లాడుకునేమాటలు యెవరూ వినకూడదు.

వీర—కొందరు వినవచ్చును. అవునుగాని ప్రియురాలా!

సర—నన్ను ప్రియురాలా గియురాలా అనకండి. ఇవేళ మీరు యింతసేపటిదాకా యెందుకు మాయింటికిరాకుండా ఆలస్యంచేసినారో వివరంగా చెప్పేవరకూ నేను మీతో మాటాడను.

వీర—ప్రొద్దున్నంతా వుద్యోగంకోసం అనుసరిస్తూ వారింటి కాడ కూర్చున్నాను.

సర—చాలును. ఇఖ చెప్పనక్కరలేదు. నేను తృప్తిపొందినాను.

వీర—మీరీబంగాళా ఖాలీచేసినట్టున్నారు. ఇది నేను అద్దెకు పుచ్చుకుంటాను. నాకు వుద్యోగంఅయి మనపెళ్ళికి మీతండ్రిగారు వప్పుకునేవరకూ ఇందుమూలంగానైనా నేను యెప్పుడూ నిన్ను చూస్తూవుంటాను.

సర—సరేసరి. చాలును. నీవు ఇక్కడవుండవద్దు. యీసంగతి మానాన్నగారికి తెలిస్తే మనం యిద్దరమూ ఆలోచించుకుని యేదో పన్నినామని అనుమానపడుతారు. మీకు ఇల్లుయివ్వడానికి అసలే వప్పుకోరు.

వీర—నేనువెళ్ళి మీసవతితల్లితో మాట్లాడుదునా?

సర—వద్దు. మనం యిద్దరమూ వంటరిగా యిక్కడవున్న సంగతి ఆవిడెకు తెలియకూడదు.

వీర—అయినాకానీ—

సర—నేను చెప్పినట్టు చెయ్యకపోతే మీరు యీ యింట్లో వుండడానికి నేనే వప్పుకోను.

వీర—ఆలాగైతే నేను వెళ్లిపోతాను. (అనివెళ్ళుచున్నాడు.)

[అప్పుడు భ్రమరాంబ తొందరగా ప్రవేశించుచున్నది.]

భ్రమ—ఇక్కడ యెక్కడనైనా యిల్లు అద్దెకు దొరుకుతుందా అని యెవరో వీధిలో అడిగితే పొరుగువాను మనయిల్లు చెప్పినారు. మాటవినపడి నేను పనివదిలిపెట్టి వేగిరం వచ్చినాను. అదుగో ఆయన ఇలాగువస్తూ వున్నారు.

సర—ఆలాగైతే అద్దె నీవేమాట్లాడి ఫరిష్కారంచెయ్యి. నేను లోపలికి వెళ్లివస్తాను. (అని వెళ్ళుచున్నది.)

[ముగము కనఁబడకుండ బట్టముసుఁగు వేసికొని పెంటయ్య ప్రవేశించుచున్నాఁడు.]

భ్రమ—దారియిది. ఇలాగురండి.

పెంట—(ముసుఁగుతీసి ఇంటికేసిచూచి) ఈయిల్లు యెవరిది?

భ్రమ—భీమరాజుగారిది. మీరు ఇంటికోసం వెతుకుతూ వున్నారుకాబోలును.

పెంట—అవును. ఆయన మీకు యేమవుతారు? తాతగారా?

భ్రమ—కారు. ఆయన మావారే.

పెంట—మీయింటిఆయనా? ఈయింట్లో వేరే పురుషులు యెవరూ లేరుకదా?

భ్రమ—లేరు.

పెంట—అలాగైతే యీయిల్లు బహుబాగావున్నది.

భ్రమ—పొరుగంతా బహుమంచిది. దీనికివున్న లోపమల్లా ఇది వూరికిచివరను కొంచెం మారుమూలగావున్నది.

పెంట—నాకు అలాగంటిల్లేకావలెను. అది యెంతమాత్రమూ లోపంకాదు. ఇళ్ళమీద ఇళ్ళువుండడంకంటె ఇలాగంటె తోటలూ దొడ్లూ అంటే నాకు బహుసంతోషం.

భ్రమ—మీరీవేళ ప్రొద్దున్నించీ భోజనంచెయ్యలేనట్టున్నది. మీకు తొందరగా వున్నట్టయితే మాకు వండుకున్న అన్నమూ కూరలూ మీకుపెట్టి మేము మళ్ళీ వండుకుంటాము. మంచి ముద్దం కాయ వండినాను. నాలుగుఅణాలు యిస్తే యీపూట మీకు పెరుగుతో భోజనంపెడుతాను. (తనలో) ఈచల్లారిపోయిన అన్నమూ కూరలూ యీయనకుపెట్టి కచేరీనుంచి ఆయనవచ్చేటప్పటికి మళ్ళీ వంటచేస్తాను.

పెంట—(తనలో) ఇక్కడ భోజనంకూడా దొరికింది. నేను యీరోజున గుమ్మందాటి వెళ్ళనక్కరలేదు. (బిగ్గరగా) నీవు మహా దొడ్డయిల్లాలులాగు కనపడుతూవున్నావు. నీతో నేను శేరమాడను. ఇంటిఅద్దె యెంతోకూడా చెప్పివెయ్యి. నన్ను పరాయివాణ్నిగా చూడక మీకుటుంబంలో వకణ్నిగా చూడవలెను. అయ్యో! నుడి బట్ట లేదుగదా?

భ్రమ—ఈపూటకు మావారి పట్టుబట్టయిస్తాను కట్టుకోండి. (అని తెచ్చియిచ్చుచున్నది.)

పెంట—ఇన్నిచోట్ల తిరిగినానుగాని నీవంటి దొడ్డయిల్లాలిని నాజన్మంయెత్తినతరువాత నేను యెక్కడాచూడలేదు. (అని పట్టుపంచె పుచ్చుకొని) ఇటువంటి భార్య దొరకడంచేత మీయింటాయన చేసు కున్న పుణ్యమేపుణ్యం.

భ్రమ—మీరు నన్ను వూరికేపొగుడుతూవున్నారు.

పెంట—నేనుచెప్పినదంతా నిజం. ఇది ముఖస్తుతికాదు.

[సరస్వతి ప్రవేశించుచున్నది.]

భ్రమ—ఈచిన్నది నాకూతురు.

పెంట—కూతురా? ఈచిన్నది మీచెల్లెలో అప్పగారో అను కున్నాను. సవితి కూతురు కాబోలును.—అమ్మాయీ! నీవుకూడా నీ తల్లిగారు చూపించినదియే నామీద కనపరచవలెను సుమా.

సర—మీరు బహుదొడ్డవారు. ఇటువంటి సత్పురుషులు మా పుణ్యంచేత మాయింటికి కాపురానికి వచ్చినారు.

పెంట—నేనుధన్యుణ్నయినాను. అమ్మా! అద్దెమాట చెప్పి నారుకారు.

భ్రమ—నెలకు నాలుగురూపాయలు.

పెంట—ఇదుగో వక నెలఅద్దె పుచ్చుకోండి. (అని నాలుగు రూపాయ లిచ్చుచున్నాఁడు.)

భ్రమ—(పుచ్చుకొని) ముందుగానే యిస్తూవున్నారా?

పెంట—యెప్పుడైతేనేమి ఇవ్వవలసింది ముందుగానే ఇచ్చినాను. (తనలో) ఈవిడె అద్దెపుచ్చుకున్నది. ఇక బ్రహ్మాదిగివచ్చినా నెల్లాళ్ళదాకా నన్ను యీ యింట్లోనుంచి యెవరూ లేవగొట్టలేరు. (అని లోపలికి వెళ్ళుచున్నాఁడు.)

సర—(తల్లితో రహస్యముగా) ఇతఁడు తమాషామనిషిలాగు వున్నాడు. నాన్నగారూ యితడూ తగువులాడకుండావుంటే బాగా వుండును.

పెంట—(కిటికీలోనుండి చూచుచు) ఈయిల్లు బహుతమాషాగా వున్నది. చుట్టూ తోటలు యెంతోముచ్చటగావున్నవి. ఈవైపున పువ్వులచెట్లువున్నవి. అవతలవైపున కూరగాయల పాదులువున్నవి. అమ్మా! వడ్డనచేయిస్తారా?

భ్రమ—మాఅమ్మాయివెళ్ళి తెస్తుంది. అమ్మాయీ! నీవు వెళ్ళి అన్నమూ కూరలూ పట్టుకునివస్తావా?

పెంట—నాపుణ్యంచేత నేడు యీఅమ్మాయిచేతి వడ్డనకూడా నాకు లభ్యమైనది.

సర—ఇదుగో తెస్తాను: (అని వెళ్ళుచున్నది.)

పెంట—యీఅమ్మాయి మహామంచిది. ఈవిడె పేరుయెవరు?

భ్రమ—సరస్వతి. మీపేరుయెవరో సెలవిస్తారా?

పెంట—నాపేరా? పేరు మంచిదైతేనేకాని మీవంటివారితో చెప్పకూడదు. నాది చెప్పరానిపేరు.

భ్రమ—మీపేరు యెవరికీ తెలియకుండా ఇక్కడ వుండవలెనని వుద్దేశించుకున్నారా?

పెంట—లేదు. అటువంటి వుద్దేశం యెంతమాత్రమూలేదు. నా పేరు ప్రసిద్ధిలోకి రావలెననే నావుద్దేశం. ఐనాకానీ ఇటువంటి చెడ్డ పేరుతో నాకుమంచి పేరుయెలాగు వస్తుందో తెలియకుండా వున్నది.

(అని పేరు మెల్లగా చెప్పుచున్నాడు.)

భ్రమ—(ఉలికిపడి) ఏమీ!

పెంట—నా పేరు మీ కసహ్యంగా వుంటుందని నాకు తెలుసును. ఇది మాపెత్తండ్రి పేరు నాకు పెట్టినారు. ఈపేరు మార్చుకోవడపు వుద్దేశంతోనే ఇప్పుడీవూరికి వచ్చినాను. మాపెత్తండ్రిగారు బ్రతికి వుండగానే ఆయన నావుద్దేశం కనిపెట్టి పేరు మార్చుకోకుండావుంటే సంవత్సరానికి నూరురూపాయలు వచ్చే తన మాన్యం నాకు వుండేటట్టున్ను పేరు మార్చుకునేటట్టయితే ఆమాన్యం తనపెళ్ళానికి వెళ్ళేటట్టున్ను యేర్పాటుచేసి చచ్చిపోయినాడు. ఆవిడిప్పుడు యీవూళ్ళో వున్నది. వక చిన్నది నన్ను పెళ్ళిచేసుకుంటానని తీరావివాహం సిద్ధమయ్యేటప్పటికి యీపాడుపేరు మార్చుకుంటేనేకాని పెళ్లిచేసుకోనన్నది. ఇప్పటావిడె మాపెత్తండ్రికి మూడోపెళ్లి పెళ్ళాము; ఆవిడెకు పద్దెనిమిదేళ్లువుంటవి. ఇక్కడి స్త్రీపునర్వివాహ సమాజంవారి ప్రోత్సాహంవల్ల ఆవిడె రెండు నెలలకిందట వకభాగ్యవంతుణ్ని మళ్ళీ పెళ్లిచేసుకున్నది. ఆవిడెకు యీముష్టినూరు రూపాయలూ యేమీ లక్ష్యంలేదు. ఆవిడెను బతిమాలుకుని యెలాగైనా ఆవిడెచేత ఈ మాన్యంతనకు అక్కరలేదనిపించుకుని పేరు మార్చుకోవలెనని ఇక్కడకు వచ్చినాను. ఆవిడె నాలుగురోజులకిందట మొగుడితో యెక్కడికో వూరికివెళ్లిందట. ఆవిడె బహుమంచిమనిషి. చిన్నప్పుడు బాలిశా

పాఠశాలలో చదువుకున్నది. ఆవిడెకు ఇష్టం లేకుండానే ముసలి పెళ్లి మొగుణ్ని తల్లిదండ్రులు కట్టిపెట్టినారు. ఆవిడె తిరిగీ వచ్చిందాకా ఈ వూళ్ళోవుంటాను.

భ్రమ—మీకార్యం వేగిరం సఫలం కావలెనని నేనుదైవాన్ని ప్రార్థిస్తాను.

పెంట—నీతల్లికడుపుచల్లగా నీనోటిమాట ఫలించవలెను.

భ్రమ—మంచివారికి దైవం యెప్పుడూ సహాయం చేస్తాడు. నేను సెలవు పుచ్చుకుంటాను. (అని వెళ్ళుచున్నది.)

పెంట—ఇఖ నేను తప్పించుకున్నాను. ఆపెద్దపులి నోట్లోనుంచి తప్పించుకున్నాను. అతడువెళ్ళి నేను చెప్పినయింటికి వెళ్ళిచూచి నేను యెక్కడికో పారిపోయినానని పేటంతా వెతుకుతాడు. వూళ్ళోవున్న సత్రాలూ వంటపూటియిళ్ళూ అన్నీ వెతికినా నేను యెక్కడా కనపడను. నేను యీమారుమూలను బుధవారపుపేటలో వుంటానని అతను అనుకోడు. రాత్రి కొంచెం తాగి మత్తుగా వుండడంచేత గాని లేకపోతే నా నిజమయినపేరూ వున్నస్థలము చెప్పివుండను. రాత్రిసంగతి తలుచుకుంటే నావొళ్ళంతా గరుపొడుస్తూవున్నది. నేనేమిటి? ఆజానుబాహుడైన ఆమోటముసలవాడితో పోట్లాడడం యేమిటి? ఆ మత్తులో వొళ్ళు తెలియక వూరికే దెబ్బలాడుతానన్నాను. ఆ నరహంతకుడు పెందరాళే లేచేవాడుకాక పోవడంచేత నేను చాలా ప్రొద్దెక్కిలేచినా వేగిరం ఫ్రాంటకూళ్ళవాళ్ళకు యివ్వవలసిన సొమ్మియిచ్చి వేసి అతను అక్కడికి రాకమునుపే తప్పించుకొని పారిపోయి వచ్చినాను. అతడు ప్రొద్దున్నే వచ్చినట్టయితే యీపాటికి నాపని యేమవునో?

[అప్పుడు వీరభద్రరాజు ప్రవేశించుచున్నాఁడు]

వీర—యెవరక్కడ?

పెంట—(భయపడి) దగ్గిరకు రాకండి. (వీరభద్రరాజు మొగము వంక చూచి) మిమ్మల్ని చూచి నిష్కారణంగా వులిక్కిపడి జడుసుకున్నాను.

వీర—ఏమరిపాటున వచ్చినందుకు క్షమించండి. (తనలో) ఇతడు యెవరై వుంటాడు?

పెంట—(తనలో) జాగ్రతగా వుండవలెను. ఇతడు వక వేళ మన జాడ తియ్యడానికి పంపించిన వేగువాడై వుండవచ్చును. (బిగ్గరగా) క్షమాపణ అక్కరలేదు. నేను ఇక్కడ వున్నానని మీరు యెరుగరు కాబోలును.

వీర—యెరగను. నేను భ్రమరాంబగారితో మాట్లాడి పోవడానికి వచ్చినాను.

పెంట—నాకు ఇల్లిచ్చిన యీ యింటామెతోనా?

వీర—ఈయిల్లు మీకప్పుడే ఇచ్చి వేసిందా?

పెంట—ఇచ్చి వేసింది. అప్పుడే పావుగంటయింది వచ్చి నేనీ యింట్లో ప్రవేశించినాను.

వీర—(తనలో) వకదాని తరువాత వకటి నాకన్నీ దురదృష్టాలే వస్తూవున్నవి. ఇక భ్రమరాంబతో మాట్లాడిన ప్రయోజనంలేదు. ఇతనితోనే యెలాగైనా మాట్లాడి యీయిల్లు పుచ్చుకోవలెను. (బిగ్గరగా) అయ్యా!

పెంట—(ఉలికిపడి నలుదిక్కులుచూచి యెవ్వరును లేకుండుటచేత ధైర్యము తెచ్చుకొని) నాకు చెవుడులేదు. మీరంత బిగ్గరగా పిలువనక్కరలేదు.

వీర—మీరు పుచ్చుకున్న యీయిల్లు నాకు ముఖ్యంగా కావలసివున్నది.

పెంట—నాకూ ముఖ్యంగానే కావలసివున్నది. మీరు ప్రయత్నం చేస్తే వూళ్లో కావలసినన్ని ఇళ్ళు దొరుకుతవి.

వీర—అవునుగాని నాకు యీయిల్లే ఆవశ్యంగా కావలెను. నిజం చెపుతాను వినండి. ఈయింటియజమానుడయిన భీమరాజుగారి కూతురు సరస్వతిమీద నాకు చాలా ప్రేమవున్నది. ఆచిన్నదాన్ని వివాహం చేసుకోవడానికి నేను ప్రయత్నం చేస్తూ వున్నాను. నేనుయీ యింట్లోవుంటేనేకాని మావివాహానికి ఆయన వప్పుకోడు. కాబట్టి మీరు సిద్ధమైన పెళ్ళికార్యానికి భంగంకలుగ చెయ్యక వేరే ఇల్లు కుదుర్చుకుంటారని నమ్ముతాను.

పెంట—నేను నీకు నాచేతనైన సహాయం చేస్తానుగాని ఇందులో వక్కసంగతి వున్నది. రాత్రి యీవూళ్లో నేను వకపెద్దమనిషితో తగవులాడి నాతో పోట్లాటకు రమ్మని నాపేరూ వున్నఇల్లూ వ్రాసియిచ్చినాను. ఆ పెద్దమనిషి యెవరో అదివరకు నేను యెప్పుడూ చూచివుండలేదు. నాకైతే భయంలేదుగాని ముక్కూ మొగమూ యెరగని వాళ్ళతో పోట్లాడడం నాకిష్టంలేదు. అందుచేతనే నేను ఇదివరదాకా వున్న పూటకూటియిల్లు వదలివేసి ఇక్కడవచ్చి ప్రవేశించినాను. నేను యీవూళ్లో కొంచెంకాలమే వుంటాను. ఈలోపుగా మరివకచోటికి వెళ్ళడానికి నాకు యిష్టంలేదు.

వీర—ఈచుట్టుపట్ల చాలాయిళ్ళు దొరుకుతవి. మీకు యింతకంటె మంచియిల్లు చూచిపెడుతాను. మీరునాకు యీ మాత్రపు వుపకారంచేస్తిరా, మీప్రాణానికి నాప్రాణమయినా అడ్డంవేసి యెవరివల్లనూ యేవిధమైన తొందరా రాకుండా నేను జాగ్రత పెడుతాను.

పెంట—నీమాటలువింటే నాకు జాలివేస్తూవున్నది. నీవు తప్ప కుండా నీవు చెప్పినంతా చేసేవాడవే. నేను చెప్పేసంగతికూడావిను. నేను యీవూళ్లో యెంతోకాలంవుండను. కొన్నిరోజులేవుంటానో కొన్ని ఘంటలేవుంటానో!

వీర—అంతేనా?

పెంట—శ్యామలాంబ అనే ఆవిడెకు నేనువ్రాసిన వుత్తరానికి జవాబునిమిత్తం యెదురుచూస్తూవున్నాను.

వీర—కొత్తపేటలోవున్న శ్యామలాంబా?

పెంట—అవును. ఆవిడెను నీవుయెరుగుదువా?

వీర—యెరుగుదును. ఆవిడెను కొత్తగా పెళ్ళాడింది నామేన మామే. వక్కనిముషం తాళండి జ్ఞాపకం చేసుకుంటాను. తనపేరు మార్చుకోవడానికి సెలవడుగుతూ కొన్నిరోజులక్రిందట ఆవిడెకు ఉత్తరంవ్రాసిన పూర్వపుభర్తతాలూకు బంధువుడవు నీవేకాదుగద?

పెంట—ఆదురదృష్టవంతుణ్ని నేనే.

వీర—మీపేరు—

పెంట—చెప్పకండి. చెప్పకండి.

వీర—(నవ్వుచు) ఆహాహా!

పెంట—నవ్వకండి. ఇది నవ్వులాటవ్యవహారంకాదు. ఇది ముఖ్య మయిన కార్యం. ఆవిడె వూళ్ళోకిరావడంతోటే—

వీర—ఆవిడె వూళ్ళోకి యీవుదయాన్నే వచ్చింది.

పెంట—అలాగైతే ఆవిడెదగ్గరనుంచి నావుత్తరానికి జవాబు రావడంతోటే—

వీర—మీరు యీయింట్లోనుంచి వెళ్ళిపోతారు. నాకు తెలి సింది. నేను యిప్పుడు పక్షిలాగు యెగిరిపోతాను.

పెంట—యెక్కడికి?

వీర—మీవుత్తరానికి జవాబుతీసుకురావడానికి. నేను యెంతో సేపువుండను. ఈలోపుగా మీకు నాపని యేమయినా కావలసివున్నట్టయితే నాపేర వుత్తరంవ్రాసి కొత్తపేటలో సత్రంయింటికి పంపండి. మీరు పరోపకారధురీణులు. మీమేలు నేను యెప్పటికీ మరిచిపోను. మీతరపుననిలిచి యెవరితోనైనా పోట్లాడమంటే పోట్లాడుతాను. నా ప్రాణం యిమ్మన్నాయిస్తాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

[విస్తరియు, చెంబులును, పీటయు పట్టుకొని సరస్వతి ప్రవేశించుచున్నది.]

సర—వీరభద్రరాజు యీయనతో మాట్లాడి వెళుతూవున్నాడు. వీరిద్దరికీ పూర్వపరిచయం వున్నట్లున్నది.

పెంట—(గదిలోపల) ఈపట్టణంలో కంపుయెక్కువగా వున్నా యిక్కడవుండే జనులు బహుమంచివాళ్ళుగా కనుపడుతూవున్నారు. ఈచిన్నవాడు నానిమిత్తం తనప్రాణమయినా యిస్తానన్నాడు. ఇతను మహామంచి అంతఃకరణ కలవాడు. నాకు యిల్లుదొరకకపోయినా యీ యిల్లు యితనికి యిచ్చివేస్తాను. (అని యీవలికి వచ్చుచున్నాఁడు.)

సర—అయ్యా! మీకూరలూ అన్నమూ పొయిమీద కొంచెము వెచ్చపెట్టి మాపిన్ని తెస్తూవున్నది.

పెంట—అమ్మాయీ! నీవా? అంతా పరిష్కారమయింది. ఈయిల్లు అతనికి యిచ్చివేస్తాను. నీవు చిరకాలం సుఖపడవలెనని ఆశీర్వాదంచేస్తూవున్నాను.

సర—మీమాటలు నాకేమీ తెలియడంలేదు.

పెంట—అవును. తెలియవు. యోగ్యురాండ్రయిన కన్నెలకు యిటువంటివియేమీ తెలియవు. సరస్వతీ! నీవద్ద రెండు యోగ్యతలు వున్నవి. నీకు చక్కతనమూ వున్నది. దానికి తగినట్లు వినయమూ వున్నది. నేను వకసారి యీగదిలోకి వెళ్ళివస్తాను. నీవు సంతోషముగావుండు. ఈయిల్లు అతనికి యిచ్చివేస్తాను. (అని లోపలికి వెళ్ళుచున్నాడు).

[భ్రమరాంబ ప్రవేశించి విస్తరిలో వడ్డించుచున్నది.]

భ్రమ—ఈయన యెక్కడికి వెళ్ళినాడు? అన్నమూ కూరలూ మళ్ళీచల్లారిపోతవి.

[భీమరాజుగారు తలుపుతీసుకొని ప్రవేశించుచున్నారు.]

భీమ—(భార్యను కోమూర్తైను చేస్సైగచేసి దగ్గరకు పిలిచి మెల్లగా) నేను వెళ్ళిన తరువాత మనయింటికి నాకోసం యెవరయినా వచ్చినారా?

సర—యెవరూరాలేదు.

భీమ—ఓప్రాణేశ్వరీ! యెవరూలేదా?

భ్రమ—రాలేదు.

భీమ—నాకు సంతోషంగావున్నది. (అని గంతులు వేయుచున్నాడు.)

భ్రమ—మీయిందాకటి విచారమంతాపోయి మళ్ళీ యెప్పటి సంతోషంవచ్చిందా?

భీమ—నేను వకప్పుడు విచారంగావున్నానా? నాకు యెప్పుడూ విచారంలేదు. నేను యెప్పుడూ సంతోషంగానే వుంటాను.

భ్రమ—విచారంలేకపోతే పోనియ్యండి. మీయిందాకటి స్థితి చూస్తే నాకు నిజంగా భయంవేసింది.

భీమ—ఇకముందు యెప్పుడూ అలాభయపడబోకు.

సర—నాన్నగారూ! మీరు వెళ్లినతరువాత మీాశలవు ప్రకారం యీాయిల్లు వకరికి అద్దెకుయిచ్చి వేసినాము.

భీమ—యెవరికి యిచ్చినారు?

భ్రమ—ఆయన యెవరో మహామంచివాడు. వక నెలఅద్దెముందుగానే యిచ్చివేసినాడు.

భీమ—రండి. మనకు మంచిదినాలు వస్తూవున్నవి. ఆయన యెక్కడవున్నాడు? ఆయనకు నేను మర్యాద చెయ్యవలెను.

సర—ఆగదిలో. (అని చూపుచున్నది.)

భ్రమ—అతిధి సత్కారం చెయ్యడానికి యజమానులు మీరు వచ్చినారు. గనుక యిఖ మేము లోపలికి వెళుతాము. (అని భ్రమరాంబయు సరస్వతియు వెళ్ళుచున్నారు.)

భీమ—ఇక నేను నిర్విచారంగా వుండవచ్చును. మాయింటికి కాపురానికివచ్చినాయన నాకు సహాయంగావుంటాడు. (విస్తరివంక చూచి) అప్పుడే వంటయిందా! ముద్వంకాయకూడా వున్నది. నాకు యిప్పుడు మనస్సులో విచారంపోయింది గనుక యీ అన్నమూ కూరలూ విస్తరీకూడా మింగివెయ్యవలెననివున్నది. నాకు యివేళ యిక్కడ వడ్డించింది. నేను లోపలికిపోయి పాగా, అంగరకా తీసివేసి యిప్పుడేవస్తాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

[పెంటయ్య ప్రవేశించుచున్నాఁడు.]

పెంట—ఇప్పటికి నాప్రాణాలు కుదుటపడ్డవి. ఇప్పుడు ఖులాసాగా భోజనంచెయ్యవచ్చును. (అని పీటమీాద కూరుచున్నాఁడు.)

[బట్టలుతీసివేసి భీమరాజు మరల ప్రవేశించుచున్నాఁడు.]

భీమ—నాపట్టుపంచె కనపడ్డదికాదు. పోనీ. నాకు యిష్టమయిన ముష్వంకాయ వున్నదిగనుక యీబట్టతోనే భోజనంచేస్తాను. (అని విస్తరివద్దకు వెళ్ళుచున్నాఁడు. అప్పుడు వారిద్దఱును ఒకరినొక రాన వాలు పట్టుచున్నారు.)

పెంట—(భయముతో) ఎవరు?

భీమ—(భయముతో) ఏమి?

పెంట—ఇదుగో ఖూనీచేసేవాడు.

భీమ—ఇదుగో సరహత్యచేసేవాడు. (వెనుకకువచ్చి తనలో) వీడుయెలాగో నాయిల్లు కనుక్కొని యిక్కడికి వచ్చినాడు.

పెంట—(తనలో) నేను యెక్కడెక్కడికి వెళ్ళినదీ యితడు వేగులవాళ్ళను పెట్టి కనుక్కొన్నాడు.

భీమ—నన్ను హింసించడానికి నీవు మా యింటికి వచ్చినావా?

పెంట—నీయిల్లా? ఈయిల్లునాది.

భీమ—ఈయిల్లునీదా! (తనలో) ఈకిరాతుడు నా యింట్లో ప్రవేశించి, నాపట్టుబట్టకట్టుకుని, నాముష్వంకాయలు మింగివెయ్యడానికి తయారుగా వున్నాడు. నామనస్సులో వక్కదురూహ కూడా పుడుతూవున్నది. ఈదురాత్ముడు నన్ను కడ తేర్చి నాపెళ్ళాన్ని వివాహ మాడవలెనని తలుచుకునివుంటాడు. (బిగ్గరగా) నీవు నాభార్యను చూచి నావా? ఈయింటావిడెను చూచివుంటావు.

పెంట—ఆవిడె నీభార్యా? అటువంటి చక్కనిపడుచు చిన్నదాన్ని నీవంటి ముసలివాడికి యిచ్చి పెళ్ళిచేసినారా? పాపం! ఆ చిన్నదాని దురదృష్టం. నీవుపుండేస్థలం నీవు చెప్పిన మంగళవారపుపేట కానే కాదా?

భీమ—నీవు లక్ష్మీవారపుపేట సత్రములో వున్నట్టుకనపడదు.

పెంట—నీపేరూ భావరాజుకాదా?

భీమ—భావరాజు భీమరాజు.

పెంట—(తనలో) ఇఖ యితని సంగతి తెలిసిపోయింది. యితను వట్టిపిరికివాడు. భయంచేత రాత్రిపేరు చెప్పకుండా యింటిపేరుమాత్రం చెప్పినాడు. వున్నస్థలంకూడా అబద్ధపుచోటు చెప్పినాడు. అందుచేత నేను ధైర్యంగావుండి మహాశూరుణ్ని అయినట్టు కనపర్చవచ్చును. (బిగ్గరగా) అయ్యా! నావిషయంలో మీరు తప్పుఅభిప్రాయపడుతూ వున్నారు. నేను వ్రాసియిచ్చినట్టు నేను లక్ష్మీవారపుపేటసత్రములోనే వున్నాను. నీవు పిరికివాడవన్నసంగతి రాత్రే కనిపెట్టి నీతోకూడా మనిషినిపంపి యెక్కడవుంటావో కనుక్కొని యిక్కడకు వచ్చినాను. ఇఖ నిన్ను నేను రాత్రీపగలూ మధ్యాహ్నమూ యెప్పుడూ వదిలిపెట్టను.

భీమ—అయ్యా! నేను కొత్తగా పెళ్ళిచేసుకున్నాను.

పెంట—నీభార్యయందు నాకుండే గౌరవంచేత ఆసంగతి యేదో విధంగా యిప్పుడే ఫరిష్కారం చేసుకుందాము. (చేయి పట్టుకొని లాగుచు) ఇదిగో యీగదిలోకి వెళుదాముర్రా.

భీమ—అయ్యా! నిర్దోషినిచంపి నరహత్య పాపంకట్టుకోవడం మీవంటి యోగ్యులకు తగునా?

పెంట—(తనలో) ఇఖనేను యితణ్ని మనసువచ్చినట్టు ఆడించవచ్చును. (బిగ్గరగా) నీకుయెవరైనా స్నేహితుడులేడా? నీకుబదులుగా అతణ్నిపంపు.

భీమ—స్నేహితుడా? (తనలో) ఇదిబాగావున్నది. ఇప్పుడు నాప్రాణాలుదక్కినవి. వీరభద్రరాజు యిదివరదాకా మాకుటుంబం

నిమిత్తం తన ప్రాణాలువిడుస్తానంటూ వుండేవాడు. దానినిజంయిప్పుడు తెలుస్తుంది. (బిగ్గరగా) వున్నాడు. అతనికి యిప్పుడే వుత్తరంవ్రాస్తాను. (అని కాగితమును కలమును పుచ్చుకొనుచున్నాఁడు.)

పెంట—(తనలో) ఇతడు నిజంగానే వ్రాస్తూవున్నాడు. ఇతనికి యిప్పుడు ధైర్యంవచ్చినట్టున్నది. ఇప్పుడే దీనికితగిన ప్రతిక్రియ చెయ్యవలెను. (అని ఆలోచించుచున్నాఁడు.)

భీమ—(తనలో) ఇఖనాకు భయంలేదు. (అని వ్రాయుచున్నాఁడు.)

పెంట—(కాగితమును కలమును పుచ్చుకొని యిట్లు వ్రాయుచున్నాఁడు.)—'ఓ స్నేహితుడా! నీవు కామించిన చిన్నదాని తండ్రే నాశత్రువు. కాబట్టి నీవు నాతరపున వుండడం బాగావుండదు. అందుచేత నాకు సహాయుణ్ణిగా మరియెవరినైనా వెంటనే సంపాదించవలెను. ఇదిమహా మహాముఖ్యమయిన కార్యం. నాగౌరవం ముఖ్యముగా కాపాడవలెను. విధేయుడు. పెం—

తాజాకలం—నీవు నాకుబదులుగా పోట్లాడవలెనన్నసంగతి నీకు బాగా తెలుసునుగదా? దిట్టంగా పోట్లాడడానికి చేతనయినవాణ్ణి సంపాదించవలెను.

భీమ—(ఉత్తరము మడఁచి పైపేరువ్రాసి) ఈవుత్తరం తీసుకుని వెళ్ళేవారు యెవరు?

[పాలచెంబు చేతఁబట్టుకొని యొకగొల్లవాఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

గొల్ల—అయ్యా! మీకు పాలుపంపించినారు.

భీమ—పాలు యిలాతీసుకునిరా. (అని దూరముగా తీసికొని వెళ్ళి గొల్లవానితో రహస్యముగా) ఈపుత్తరం తీసుకునివెళ్ళి వెంటనే వీరభద్రరాజుకు యిచ్చిరా.

గొల్ల—(పుచ్చుకొని) చిత్తము. (అని నడుచుచున్నాడు.)

పెంట—(గొల్లవానితో వీధిగుమ్మముదాక నడిచి) నీవు యీ పుత్తరం మంగళవారపుపేట సత్రంలోవున్న వీరభద్రరాజుగారికి యివ్వవలెను. ఈపని చేసినందుకు నీకు రెండణాలు యిస్తాను. (అని యుత్తరమును సొమ్మును చేతిలో పెట్టుచున్నాడు.)

గొల్ల—ఇప్పుడేయిస్తాను. (అని వెళ్ళుచున్నాడు.)

భీమ—(ముందుకును వెనుకకును నడుచుచు తనలో) ఈవ్యవహారంలో యేదో చిత్రం జరుగుతుంది. (పెంటయ్యతో) ఇప్పటి స్థితిని బట్టి చూస్తే యిఖమనం యిద్దరమూ వక్కయింట్లో వుండడం పొసగదు. ఈమాటల సూచన మీకు తెలిసిందా?

పెంట—నాకు సూచనలూ గీచనలూ తెలియవు. నేను ముందుగా అద్దెయిచ్చివేసినాను. నెలదినములదాకా యిదినాయిల్లు. నేను యిక్కడనుంచి కదలను. ఇక్కడ నేవుండి నాకూరలూ నా అన్నమూ నేను యిక్కడనే తింటాను. (అని విస్తరిముందు పీటమీద కూర్చున్నాడు.)

భీమ—నీకూరలూ నీఅన్నమూనా? నీచర్యచూస్తే నావొళ్ళు మండుతూ వున్నది. నీవునాయిల్లు వదలివెళ్ళనంటూ వున్నావుగా? నేనే యీయిల్లువిడిచి లేచిపోవలెను కాబోలును.

[దీపముపట్టుకొని భ్రమరాంబ ప్రవేశించుచున్నది.]

భ్రమ—ఈగడబిడంతా యేమిటి?

భీమ—నీవు నాకు అడ్డంరావద్దు. నాహంతకుణ్ని నిన్నూ వదలివేసి నేను వెళ్లిపోతాను. (అని వెలుపలికి వెళ్ళుచున్నాడు.)

పెంట—(వంకాయతో అన్నము తినుచున్నాఁడు.)

భ్రమ—(దగ్గరకు వెళ్ళి) ఏమయ్యా? మీరు నా భర్తగారిని హత్యచేస్తారా? నాకు యీపసుపూకుంకమూ కూడాలేకుండా చేస్తారా? సరస్వతీ! సరస్వతీ! (అని యేడ్చుచున్నది.)

పెంట—చేస్తేయేమి? ఈముసలిమొగుడుపోతే నీకు కావలిస్తే యింతకంటె మంచిమొగుడేవస్తాడు.

[సరస్వతి పరుగెత్తుకొని వచ్చుచున్నది.]

సర—పిన్నీ! యేమిటి?

భ్రమ—నాకుయేమీ తెలియదు. ఇక్కడ యేదోఖూనీ జరగ పోతుంది.

సర—ఖూనీ జరుగుతుందా?

భ్రమ—నాభర్తగారు నాకంటె ముసలివారయితే అయినారు. నాకు ఆయనయందేయిష్టము. మీరు ఆయనజోలికి వెళ్ళవలెనంటే ముందుగా నన్ను చంపి మరీ ఆయనమీదికి వెళ్ళండి.

పెంట—అలాగయితే ఆయన బ్రతికిపోయినాడు.

[వీరభద్రరాజు తొందరగా ప్రవేశించుచున్నాఁడు]

భ్రమ—వీరభద్రా! నీకు యిక్కడ జరిగేసంగతంతా తెలిసినట్టయితే—

వీర—నాకంతా తెలుసును. (పెంటయ్యతో రహస్యముగా) మీరుపంపించిన మనిషి నాకు దోవలోకనపడ్డాడు.

పెంట—నావుత్తరం చదువుకొన్నారా?

భ్రమ—నేను వుండగా నాభర్తగారికి యేమీ అపాయం రానియ్యను. ఆయన పోట్లాడవలసివుంటే ఆయనకు బదులుగా నేను పోట్లాడుతాను.

పెంట—నిన్ను ప్రతినిధినిగా నేను వప్పుకోను. నేను తుపాకులకయినా కత్తులకయినా వోపగలనుగాని ఆడవాళ్ళగోళ్ళతో వోపలేను.

భ్రమ—నేను యిప్పుడువెళ్ళి యీచుట్టుపట్ల వాళ్ళనందరినీ పిలుచుకునివస్తాను.

వీర—అమ్మా! నీవు యేమీా తొందరపడక యీవ్యవహారమంతా నాకువదిలిపెట్టు. ఇందులో నీభర్తగారికి యేమీా అపాయం రాదు. నామాటనమ్ము.

భ్రమ—వీరభద్రా? నేను అంతకూ నిన్నే నమ్మినాను. వెధవరికంమాట తలచుకుంటే నావొళ్ళు వణుకుతూవున్నది. (అనివెళ్ళుచున్నది.)

సర—ఓయీ! మాకుటుంబముయొక్క గౌరవమంతా నీచేతులోవున్నది. మానాన్నగారికి యేమీా అపాయం రానియ్యకు)

(అని వెళ్ళుచున్నది.)

పెంట—నీవు మంచిసమయానికి పుట్టిపడ్డావు. నాచీటీ నీకు అందిందా?

వీర—మీామనిషి నాకుదోవలో కనపడ్డాడు. భీమరాజుగారు కూడా అతనిచేతికే వుత్తరంయిచ్చి పంపినారు. ఆయన నన్ను తనకు సహాయుణ్నిగా వుండవలెనని కోరినారు.

పెంట—అలాగైతేమరీమంచిది. యీవ్యవహారం సులభంగా పరిష్కారమవుతుంది.

వీర—అవుతుంది. సరస్వతియందు నాకు యెంతప్రేమవున్నా మీాయందుకూడా నాకు విశేషగౌరవం కలిగింది ఆగౌరవం కనపర్చడానికి ఇప్పుడు సమయం వచ్చింది.

పెంట—ఇది నీయోగ్యతకు తగివున్నది.

వీర—మీకు సహాయుణ్ని సంపాదించినాను.

పెంట—సంతోషంగా వున్నది.

వీర—అతను మహాపౌరుషశాలి. భీమరాజుగారు క్షమార్పణ కోరి మీరుయిద్దరూ సమాధానపడుతామన్నా పడనిచ్చేవాడుకాడు. మీరు వోడిపోయినా మీస్థానమందు నిలిచి పగతీర్చుకుంటాడు.

పెంట—నావు త్తరంలో తాజాకలం నీవు చదవలేదా యేమిటి?

వీర—భీమరాజుగారు బహుకోపధారులు. మీరు భయపడ గూడదు. మీరు ధైర్యంగా నిలువవలెను. యుద్ధంలో మీ ఆయుధము లేమిటి?

పెంట—నా తాజాకలం నీస్నేహితుడికి చూపించవలెను.

వీర—తెలిసింది. ఆయుధాలు తుపాకీలు. వొకరికొకరికి పది హేను బారలదూరము.

పెంట—అదంతా నా కేమీ తెలియదు. మీలో మీరే చూచుకోవలెను.

వీర—ఇప్పుడీ అపాయం తప్పించుకోవడానికి వున్నసాధన మంతా మీధైర్యంలో వున్నది. ఆయనయెదుట మీరు భయంకరంగా కనపడవలెను.

పెంట—ఆయనయెదుట యిదివరకే వుండవలసిన దానికంటె యెక్కువభీకరంగా కనపడ్డాను.

వీర—ఈవ్యవహారమంతా నాకువిడిచిపెట్టండి.

పెంట—విడిచిపెట్టినాను. నాజరూరులేకపోతే నీవన్నట్టు తుపాకులే ఆయుధాలు. దూరమూ పదిహేనుబారలే. నావు త్తరంలోవున్న తాజాకలం మీరతనికి వినిపించి వుండవలసింది. (అని లోపలికి వెళ్ళు చున్నాడు.)

వీర—ఇప్పటికి వకరిని దారికి తెచ్చినాను. ఇఖ రెండోవారిని కూడా స్వాధీనం చేసుకోవలెను.

భీమ—(తలుపులోనుండి తల లోపలికిపెట్టి) వీరభద్రా!

వీర—భీమరాజుగారా?

భీమ—నీకోసమే నేను ఇక్కడ కాచుకునివున్నాను. నాకేసి చూడకుండానే నీవు తుర్రున లోపలదూరినావు. అతణ్ని చూచినావా?

వీర—అతనాగదిలోనే వున్నాడు. మెల్లిగా మాట్లాడండి. మీరు మహావీరుడితో యుద్ధముచేయవలెను. అతను దయాదాక్షిణ్యములు లేనివాడు.

భీమ—ఆక్రూరుణ్ని మొదటినుంచీ నేను అలాగే అనుకున్నాను వాడు క్రూరరాక్షసుడు.

వీర—మీరుధైర్యంగా వుండవలెను. అటువంటి వాడియెదుట మీ రధైర్యము యెంతమాత్రమూ కనపరచకూడదు. యెంతసాహసంగలవాడూకూడా ధైర్యంగల వాడికి వెనుకతీస్తాడు. మీకు యిందులో యేదయినా ప్రాణాపాయమే వచ్చేటట్టయితే మీకుటుంబాన్ని నేను సంరక్షణచేస్తాను. భయపడకండి. మీవుత్తరంచూస్తే నాకు చాలా జాలివేసింది. మీరే వోడిపోవడం తటస్థమైతే మిమ్మలినే నేను యెప్పుడూ తలుచుకుంటూ వుంటాను.

భీమ—నావుత్తరం నీవు తిన్నగా చదవలేదు.

వీర—చదివినాను. ఈసంగతి వెల్లడయ్యేటట్టయితే లోకానికి మీరు పిరికివారనేటట్టు కనపడనిచ్చి మీగౌరవానికి భంగంకలిగేటట్టు చేస్తాననుకున్నారా యేమిటి?

భీమ—అందులో నాపిరికితనం యేమిటి? నాతరఫున నిన్ను పోట్లాడమని కోరలేదా?

వీర—దానికీ అంతేఅర్థము.

భీమ—అందులోయేమీలేదు. ఒకరిపక్షంగా ఒకరు యుద్ధం చెయ్యడం సర్వసాధారణంగా జరుగుతూనేవుంటుంది. అందులో పౌరుష హాని యేమీవుండదు.

వీర—వుండకపోవచ్చును. యీవ్యవహారం మీలోమీరే చక్కపెట్టుకోవలెను. ఇందులో మీకు యేమీ అపాయంలేకుండా నేను ఒకవుపాయం ఆలోచించినాను.

భీమ—అదియేమిటోచెప్పు. అది బాగావున్నట్టయితే నేను కూడా ధైర్యంలో అతనికి తీసిపోయేవాణ్ని కానట్టు కనపరుస్తాను.

వీర—నేను ఆలోచించిన వుపాయం మహాసూక్ష్మమయింది.

భీమ—అలాగయితే వేగిరంచెప్పు.

వీర—మీయిద్దరికీకూడా నేనే సహాయుణ్నిగావుండి మీయిద్దరి తుపాకీలలోనూకూడా నేనే మందుకూరుతాను.

భీమ—మందుకూరుతావా?

వీర—వట్టిమందు కూరుతాను. గుండ్లువెయ్యను.

భీమ—నేను ఆలాగే అనుకున్నాను.

వీర—మీరు యిప్పుడే యీగదిలోనే పోట్లాడవలెను.

భీమ—నీవుకూడా దగ్గిరవుండవలెను. నాకు తుపాకిచూస్తే భయంవేస్తుంది.

వీర—మీరు చూడనక్కరలేదు. అప్పుడు నేనీగదిలో దీపాలు తీసివేస్తాను.

భీమ—అలాగయితే చీకటిలో కుమ్ములాటా?

వీర—అతను ఆగదిలోవున్నాడు. నేను వెళ్ళి ముందరి యేర్పాటు లన్నీ చేస్తాను. (అని వెళ్ళుచున్నాడు.)

భీమ—నాగుండెలు కొట్టుకుంటూవున్నవి. అయినాకానీ నాకు యేమీ అపాయంరాదని నిశ్చయంగా తెలుసునుగనుక నేను మాటలలో కావలసినంత శూరత్వం కనపరుస్తాను. అగ్నిహోత్రంలో మిడుత దూకడానికి వస్తూవున్నది.

[పెంటయ్యతో వీరభద్రరాజు ప్రవేశించుచున్నాడు.]

పెంట—(రహస్యముగా) నాకేమీ అపాయంరాదని మీరు దృఢంగా చెప్పగలరా!

వీర—కావలసినంత దృఢంగా చెప్పగలను.

భీమ—(పెంటయ్య మొగమువంక చూచుచు తనలో) వీడి మొఖం దెయ్యపుముఖంలాగు వూరుకున్నది.

వీర—నాయనలారా! ఇది మహాగొప్పకార్యంగాని సాధారణ మయిందికాదు. ధైర్యశాలులలోనెల్ల ధైర్యశాలులైన మహాశూరులిద్దరున్నూ నాయెదుట నిలుచున్నారు. నాకు బహుసంతోషంగా వున్నది. (పెంటయ్యను చూపుచు భీమరాజుతో) అయ్యా! ఈయన నిన్నరాత్రి నాటకపుపాకలో మీతలగుడ్డమీదకూర్చుని మీకవమానం కలుగచేసినాడు. కాబట్టి మీయుద్ధం కాచుకోవడానికి సిద్ధంగా వున్నాడు.

పెంట—అవును సిద్ధంగావున్నాను.

భీమ—నీవు నన్ను అవమానపరచడం నన్ను వక్కణే అవమాన పరచడంకాదు. పెద్దమనుష్యులకందరికీ అవమానం కలుగజేసినావు. అందుచేత నీమీద అందరూ పగతీర్చుకోవలెను.

పెంట—నేనూ పగతీర్చుకుంటాను.

వీర—అంతా సిద్ధమయిందా?

భీమ—(భయముతో) అంతా.

పెంట—(గద్గదస్వరముతో) అంతా.

వీర—(ఇద్దఱిమీాదను చెఱియొక చేయియునైచి) లోకంలో పౌరుశాలులంటే మీారిద్దరే పౌరుషశాలులు.

పెంట—(ధైర్యము తెచ్చుకొని) తుపాకులా?

భీమ—తుపాకీలే!

పెంట—బారుచేసినవేనా?

భీమ—బారుచేసినవే!

పెంట—మందు వేసేనా?

భీమ—మందు వేసే!

పెంట—ఇంకా—

భీమ—అన్నీని.

పెంట—దీపాలు లేకుండానేనా?

భీమ—దీపాలు లేకుండానే.

పెంట—నేను సిద్ధంగావున్నాను.

భీమ—నేనంతకుమునుపే వున్నాను.

వీర—(రెండుతుపాకులు చూపి) ఇవిగో మీాఆయుధాలు.

ఇద్దఱు—(ఉలికిపడి, కొంతసేపనుమానించి, తుదకు చెఱియొక తుపాకియు పుచ్చుకొనుచున్నారు.)

భీమ—వీరభద్రా! నీచెయ్యి నారొమ్ముమీాద పెట్టి నాగుండెలు కొట్టుకుంటూవున్న వేమోచూడు.

వీర—(ఇద్దఱి రొమ్ములమీాదను చేయివేసి) లోపల అసలే గుండెలులేనట్లు మహానెమ్మదిగావున్నది. మీారు యిద్దరూ గుండెలు తీసినబంట్లు. నేను మూడుమాట్లు చప్పట్లుచరుస్తాను. మూడోమాటు చరవగానే కాల్చండి. నేను యిప్పుడు దీపాలు తీసుకువెళుతాను.

పెంట—కాలుస్తాము.

భీమ—కాలుస్తాము.

వీర—ఇప్పుడు మీయిద్దరి కోరికప్రకారమూ తలుపులు వేస్తాను. (అని వేయుచున్నాఁడు.)

భీమ—నాకోరికప్రకారము. (తనలో) ఇందులో యేదో కొంటె తనంవున్నది. నా జాగ్రతమీద నేనువుంటాను.

పెంట—(తనలో) అతను చీకటికావలెనంటూ వున్నాడు. అతని కేదోలోపల దురుద్దేశ్యంవున్నది.

వీర—(దీపములు చేతితో పట్టుకొని) ఇఖ మీరు చెప్పవల సింది. యేమీలేదుగదా?

పెంట—లేదు.

భీమ—లేదు.

వీర—ఇఖ నేను వెళుతాను. (అనివెళ్ళఁబోవుచున్నాఁడు.)

భీమ—(మరల పిలిచి తుపాకిచూపి వీరభద్రరాజుతో రహస్య ముగా) అందులో యేమీభయం లేదుగదా?

వీర—భయంలేదు.

పెంట—(వీరభద్రరాజుతో రహస్యముగా) అపాయకరం కాదు గదా?

వీర—కాదు. (అని వెళ్ళుచున్నాఁడు.)

భీమ—(కొంచెంతాళి) నేను చీకటిలో వుండలేను. నాకు చిన్న ప్పుడు నమేతూ చీకటంటేభయం. అనేక క్రూరమైన నేరాలు చీకటి లోనే చెయ్యబడుతవి. అదుగో! అతను కదులుతూ వున్నట్టున్నాడు!

పెంట—(కిటికీవద్దకుపోయి) ఈచీకటిలోపెట్టి నన్ను మోసం చెయ్యవలెనంటే నేను తప్పించుకోలేనా? (కిటికీతలుపుదీసి) అతను దగ్గి

రకు వచ్చినాడంటే, ఒక్కదూకు దూకి కిటికీలోనుంచి అవతలపడి క్షణంలో ప్రాణాలు దక్కించుకుంటాను. నాకు ఫర్వాలేదు.

భీమ—(ఆలకించి) అతను కిటికీతలుపు తీసినాడు. అతనికి తప్పకుండా ఖూనీచెయ్యడపు వుద్దేశంవున్నది. ఖూనీచేసి ఆకిటికీలోనుంచి పారిపోవడానికి చూస్తూవున్నాడు. (కిటికీతలుపుతీసి) అతను దగ్గిరకు వచ్చినాడంటే నేను యీకిటికీలోనుంచి దూకి యిరుగుపొరుగువారి నందరినీ కేకలువేస్తాను.

వీర—(వెలుపలినుండి రెండుసారులు చేతులుచరచుచున్నాఁడు.)

పెంట & భీమ—ఇద్దఱును భయముచేత వడఁకుచు, ఎవ్వరయిన సమీపమునకువచ్చిన పక్షమున వెలుపలికి దుముకవలెనని చెఱియొక కిటికిలోను కూరుచున్నారు.)

వీర—మూఁడవసారి చప్పటలుచరిచి, లోపలికి వెళ్ళి యొక తుపాకీ ఆకాశమున పేల్చుచున్నాఁడు.)

పెంట—అతను మొట్టమొదట తుపాకీకాల్చినాడు.

భీమ—మొదట అతనే తుపాకీ కాల్చినాడు.

(ఇద్దరును చెఱియొక కిటికీలోనుండియు వెలుపలికి దుముకుచున్నారు.)

[భ్రమరాంబయు సరస్వతియు చప్పుడువిని పరుగెత్తుకొని వచ్చుచున్నారు. దీపములు పట్టుకొని వీరభద్రరాజు మరల ప్రవేశించుచున్నాఁడు.]

భ్రమ—ఖూనీ. ఖూనీ.

సర—పోలీసువారు. పోలీసువారు.

వీర—భ్రమరాంబా! సరస్వతీ! వూరుకోండి. యెవరికీ యేమీ హానిజరగలేదు.

భ్రమ—నాభర్తగారెక్కడవున్నారు? ప్రాణేశ్వరా! యెక్కడ వున్నావు?

భీమ—(కిటికీలోనుండి తొంగిచూచుచు) ఇదుగో యిక్కడ వున్నాను.

భ్రమ—(అంతట చూచుచు) ఇక్కడ యెక్కడ?

భీమ—తోటకూరమడిలో.

వీర—పెంటయ్యగారు యెక్కడవున్నారు?

పెంట—(రెండవ కిటికీలోనుండి తలదూర్చి) నేను యిక్కడ వున్నాను.

సర—(అంతటను జూచి) యెక్కడ?

పెంట—ఇక్కడ చేమంతిమడిలో.

భ్రమ—మీరు యిద్దరూ అక్కడయేమిచేస్తూవున్నారు?

భీమ—యుద్ధము.

పెంట—ఘోరయుద్ధము.

వీర—మీ యుద్ధము తోటకూరమడిలోనా చేమంతిలోనూనా? లోపలికిరండి.

[భీమరాజును పెంటయ్యయు లోపలికి వచ్చుచున్నారు.]

భీమ—మీరు రావడంచప్పుడు మేము విన్నాము.

పెంట—మేము మీరు పోలీసువారనుకున్నాము.

భీమ—అందుచేతనే మేము అవతలికి దూకినాము.

పెంట—అంతేకాకుండా—అంతే కాకుండా—

వీర—యేమయితే యేమిలెండి. మీరు యిద్దరూ మీగారవాలు నిలుపుకున్నారు. మీరు యిద్దరూ నేడు రణశూరు లనిపించుకున్నారు.

భీమ—(పెంటయ్యతో) అయ్యా! మీవల్ల గౌరవంకలిగితే నాకు బహుసంతోషంగా వుంటుంది.

పెంట—అని మీకు యిదివరకే కలిగింది.

భీమ—మీమీద నేను తుపాకీకాల్చను.

పెంట—అనగా రెండోమాటా?

భీమ—రెండోమాటేమి? యిప్పుడు తుపాకీకాల్చినవారు మీరు.

పెంట—మీరు.

భీమ—కాదు. మీరే.

పెంట—గుండు నాచెవివద్దనుంచి రంయ్యిమని పోయింది.

భీమ—మీగుండు నాతలవెంట్రుకలను దూసుకునిపోయింది.

వీర—అయ్యలారా! వ్యవహారం పరిష్కారమయింది గనుక యిక మనకావిషయమయి వాదం అక్కరలేదు.

పెంట—అది బాగావున్నది. భీమరాజుగారూ! మీచెయ్యి యిలాగు యివ్వండి.

భీమ—సంతోషంతో యిస్తాను. అయ్యా!, మరిచిపోయినాను మీపేరేమిటి?

వీర—పెం—

పెంట—చెప్పకు చెప్పకు. (అని వీరభద్రరాజు నోరుమూయు చున్నాడు.)

[ఒక సేవకుడు ప్రవేశించుచున్నాడు.]

సేవ—అయ్యా! వీరభద్రరాజుగారికి వుత్తరం తెచ్చినాను.

వీర—నాకా? (అని పుచ్చుకొని విప్పిచూచి లోపలనున్న యొక యుత్తరము పెంటయ్య కిచ్చుచున్నాడు.)

పెంట—ఈవుత్తరం యెవరువ్రాసింది?

వీర—మీకు మీపెత్తల్లి వ్రాసింది.

పెంట—చివరకు జవాబువచ్చింది. నాచేతులు వణుకుతూ వున్నవి. (అని విప్పి చదువుచున్నాఁడు.)—"ఓప్రియపుత్రుడా! నీవంత దీనత్వముతో చేసినప్రార్థనను నేను నిరాకరించలేను. మీపెత్తండ్రిగారు యిచ్చిన ఆస్తి నాకు అవశ్యంలేదుగనుక, అది నీవే స్వేచ్ఛగా అనుభవించు. ఇక నీయిష్టంవచ్చినట్టుగా నీపేరు మార్చుకోవచ్చును. ఇట్లు నీపెత్తల్లి శ్యామలాంబ."—నాకు బహుసంతోషంగా వున్నది. నేడు మహాసుదినం. (అని గంతులువేయుచు) భీమరాజుగారూ! భ్రమరాంబగారూ! నేటికి నేను చరితార్థుణ్ని అయినాను. నామీద దయ వుంచండి. మిత్రుడా! ఇక యీయిల్లు నీకు విడిచిపెట్టి తక్షణం వెళ్ళిపోతాను.

వీర—వెళ్ళిపోతారుగాని ముందు మీపేరేటిమి?

పెంట—నేను యిదివరకు యేమీ ఆలోచించుకోలేదు. ఇప్పుడు మనఅందరిబుద్ధీ వుపయోగించి ఆలోచింతాము. ముందుగా నన్నాలోచించనియ్యండి.

భీమ—రామయ్య.

భ్రమ—సోమయ్య.

సర—భీమయ్య.

వీర—కామయ్య.

పెంట—ఇవన్నీ సర్వసాధారణమయినపేర్లు. వీటిలో వకటీ పనికిరాదు. ఎందులోనూ తొందరపడకూడదు. రేపురాత్రి మళ్ళీ మనమంతా యిక్కడచేరి సావకాశంగా ఆలోచింతాము. అయినా

కానీ నేను యిప్పుడే వెళ్ళిపోతూవున్నాను. గనుక వెనుకనుంచి నాపేరు మీకు టపాద్వారా తెలియచేస్తాను. మిమ్మలినందరినీ వదిలిపెట్టి వెళ్ళ వలసి వచ్చినందుకు నాకు చాలా విచారంగావున్నది. (అని వెళ్ళఁబోవు చున్నాఁడు.)

భ్రమ—మాలోపలి యిల్లుకూడా చూచి వెళుదురుగాని వక్క సారి లోపలికిరండి.

(అందఱును వెళ్ళుచున్నారు.)

—

సోదరన్ ప్రెస్, కలర్ ప్రింటర్స్ & బాక్సు మేకర్స్, రాజమండ్రి.

కలిపురుష శనైశ్చర విలాసము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

మూడవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,

రాజమహేంద్రవరము

1950

కలిపురుషశనైశ్చరవిలాసము

ప్రథమరంగము—భూలోకము.

[కలిపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కలి—నేను కృతార్థుణ్ని అయినాను. ఇప్పుడు భూలోకంలో నారాజ్యం స్థిరంగా స్థాపించినాను. ధర్మదేవతయొక్క మూడుకాళ్ళు విరుగకొట్టినాను. ధర్మదేవత వొంటికాలుతో కుంటుకుంటూ చావకుండా బ్రతకకుండా వున్నది. ఇంచుమించుగా జనులందరూ నాకుభక్తులయినారు. దేవుణ్ని ఆరాధించడం మానివేసి నేను యేర్పరచిన బొమ్మలను పూజచేస్తూ ప్రజలు మూఢులవుతూవున్నారు; సత్యం వదిలిపెట్టి అనృతవాదులవుతూవున్నారు. ఇంటతిని యింటివాసాలు లెక్కపెట్టినట్టుగా కృతఘ్నులవుతూవున్నారు. అయినాకానీ యింకా కొందరు ధర్మాన్నీ - సత్యాన్నీ - జ్ఞానాన్నీ వదిలిపెట్టలేక పీకులాడుతూ వున్నారు. అపరిమితంగావున్న నాదాసుల సహాయంచేత వాళ్ళనుకూడా రూపుమాపివేస్తే నా మనోరథం పూర్ణంగా సఫలమవుతుంది. అయినాకానీ వాళ్ళకు యింకా కొంతకాలం గ్రహచారం బాగావున్నట్టున్నది. భూమిమీదవున్న నాకుసహాయంగా ఆకాశంమీదవున్న శనికూడా కలిస్తే నేను అందరినీ వక్కనిమిషములో స్వాధీనం చేసుకుంటాను. అందుకోసం ముందుగా శనిని ధ్యానిస్తాను—

శ్లో. చాపాసనో గృధ్రరథ స్సునీలః ప్రత్యస్ముఖః కాశ్యపతిః ప్రతీచ్యాం
సశూలచాపేషు వరప్రదశ్చ సౌరాష్ట్రిదేశే ప్రభవశ్చ సౌరీ
నీలద్యుతి ర్నీలవపుః కిరీటీ గృధ్రస్థితి శ్చాపకరో ధనుష్మాన్
చతుర్భుజ స్సూర్యసుతః ప్రశాంత స్సదాస్తుమహ్యంవరమందగామీ

[అంతట శనైశ్చరుఁడు ప్రత్యక్షమగుచున్నాఁడు.]

శని—ఓరీ! కలీ! నీ భక్తికి మెచ్చినాము. నీకు వరప్రదానము చేసి కార్యసిద్ధి సమకూర్చడానికి మేముకూడా యీభూలోకంలో నివాసంచేస్తాము.

కలి—స్వామీ! మీ అనుగ్రహంవల్ల నేనుధన్యుణ్ని అయినాను.

శని—ఓరీ! నీకు మావల్లయేమికావలెను? నీవు బహుసమర్థుడవు. నీసామర్థ్యానికి సంతోషించి నీవుమమ్ము వేడుకోకపూర్వంకూడా నీకు మేము సాహాయ్యం చేస్తూనే వున్నాము. నలమహారాజంతటివాణ్ని సమస్తభాదలూపెట్టి, భార్యతో వియోగం కూడా కలుగచేసిన నీకు సామాన్యులయిన యీలోకంవాళ్ళుయెంత? గుడిమింగేవాడికి గుళ్ళో దేవుడు వట్రవడియంకదా!

కలి—స్వామీ! ఇదంతా తమప్రసాదంవల్ల జరిగిందేకాని నా సామర్థ్యంవల్ల కాదు. దేవుడంటే జ్ఞాపకం వచ్చింది. నేను జనులను దేవుణ్ని యెంతకొలవకుండా చేసినా మానక కొంతగుంది మానసికంగా దేవుణ్ని వుపాసనచేస్తూ సత్యశౌచాదులు మంచివనిబోధిస్తూ కొంతమందిని తమమార్గంలోకి దింపుతూవున్నారు. ఇది చెడగొట్టడానికి యేమివుపాయం?

శని వక్కవుపాయంయేమిటి? లక్షవుపాయాలున్నవి. సత్యానికి వక్కటే మార్గం కాని అబద్ధానికి అన్నీమార్గాలే. నిజం చెప్పవలెనంటే వంకాయను వంకాయ అని వక్కటే చెప్పవలెనుగాని, అసత్యాలాడవలెనంటే బీరకాయ బెండకాయ అని లోకంలో పేర్లన్నీ లక్షచెప్పవచ్చును. మొట్టమొదట మంచివాళ్ళనందరినీ చెడ్డవాళ్ళని లక్షవిధాల అపవాదలువేతాము. వాళ్ళుచేసే మంచిప్రయత్నాల కన్నింటికీ దురుద్దేశాలుకల్పించి ప్రకటింతాము. మాయోపాయాలచేత వాళ్ళమంచి

పేరు చెడగొట్టి అపకీర్తి వచ్చేటట్టుచేతాము. లోకంలో మనకంటె మంచివాళ్ళు లేరనీ మనమొక్కళ్ళమే కష్టపడి లోకోపకారం చేస్తూ వున్నామనీ అబద్ధాలాడి నమ్మింతాము. మనదాసుల నందరినీ యీ పనికి ప్రేరేపింతాము. మనప్రయత్నం ముందర యీలోకంలో దేవుడి ప్రయత్నం యేమీసాగదు.

కలి—ఇదంతా బాగానేవున్నదికాని దేవుడిమీది విశ్వాసం పోగొట్టడంయేలాగు?

శని—దానికి రెండు మంచిమార్గాలున్నవి. అసలు దేవుడే లేడని బోధించి నమ్మించడం వకటి. ఆత్మలేదని బోధించి నమ్మించడం యింకొకటి. యీరెండు విధాలచేతనూ జనులను నాస్తికులనుచేస్తే మన అభీష్టంపూర్ణంగా సఫలమవుతుంది. అప్పుడు మనమే దేవుళ్ళం కావచ్చును.

కలి—ఈయుగంలో మనమే దేవుళ్ళము. జనులు మనదాసులయి మనమాటనమ్మినట్టు దేవునిమాటనమ్మరు. మనకు అంతరాత్మలు నిజంగానేలేవు. కాబట్టి యెవరికీ అంతరాత్మలు లేనేలేవని బోధింతాము.

శని—ఆలాగే బోధింతాము. మనంకూడా జనులలో చేరితేనే తప్ప మనకోరిక సఫలం కాదుగనుక మనం మనుష్యవేషాలు వేసుకుని వాళ్ళల్లో చేరుదాము. మన భక్తులసంఖ్య విస్తారంగా వున్నది గనుక వాళ్ళల్లో నాయకులను తీసుకుని రేపు రాత్రి నీవు మా యింటికిరా. చెయ్యవలసిన పనులన్నీ అప్పుడు రహస్యంగా ఆలోచింతాము.

కలి—చిత్తము. [ఇద్దరూ వెళుతున్నారు.]